
ఆంధ్రమహిళ





ది ఖటావ్ మెకన్జి స్పిన్నింగ్ & వీవింగ్ కంపెనీ లిమిటెడ్, బైకుల్లా, బొంబాయి.



దీపావళి కానుకలు

దీపావళి! ఇట్టి మహా పర్వదినమున 'పండుగ' ఆనందమును అనుభవించాలంటే సేవాజీవితము నలవరచుకొన్న సంస్థలకు సహృదయంతో కానుకలనుసమర్పించడంకన్నా ఘనతరమైన మార్గంలేదు.

మహిళామణులు పర్వతనేని సంపూర్ణమ్మగారు, వె. పుష్పావతిగారు, జమ్మి లక్ష్మినరసమ్మగారు, టంగుటూరి అహల్యగారు, నిడమర్తి వెంకటనరసమ్మగారు, పప్పు కామాక్షమ్మగారు, ప్రత్తిపాటి రత్నమ్మగారు, కొండా జానికమ్మగారు, పాటిబండ సుందరమ్మగారు, జి. సుభద్రమ్మగారు, వల్లూరి సీతా మహాలక్ష్మమ్మగారు, ఎ. ఎల్. శేషమ్మగారు, అల్లాడి కృష్ణస్వామిసతిగారు, నిడమర్తి సరస్వతిగారు యీ శుభసమయమున ఆంధ్ర మహిళాసభకు ఒక్కొక్కరు వందరూపాయిలు విరాళమిచ్చి శాశ్వత సభ్యురాండ్రుగా ఎన్నుకోబడ్డారు. ఈ విధంగా స్త్రీ జనోద్యమమునకు తోడ్పడిన సోదరీమణులకు మాసభ కృతజ్ఞతను ప్రకటిస్తోంది.


తేయాకు ఎప్పుడైతే కమ్మనివాసన గలిగియుండునో అప్పుడే తాజాగా నుండునని తెలియవలెను.
బ్రూక్ బాండ్ టీ కమ్మని వాసనగలిగి తాజాగా యుండ బట్టి బ్రహ్మాండమైన భారతదేశమునం దెల్లచోట్లవలె పంచ నదులు ప్రవహించు పంజాబులోకూడా జనప్రియమైయున్నది.
బ్రూక్ బాండ్


రెండాకులు ఒక మొగ్గ

ఆంధ్ర మహిళ

మైలాపూరు :: అక్టోబరు 1946 :: మదరాసు

: ముఖచిత్రం :

చిత్రరచన : శ్రీమతి దిగుమర్తి బుచ్చికృష్ణ




ఆంధ్ర మహిళాసభా భవనాలు, మహిళాపురి, మద్రాసు

ఆంధ్రమహిళ

సంపుటి 3 దీపావళి 1946 సంచికలు 9, 10

ఢిల్లీ ఎయిరోడ్రోము పండుగ ముస్తాబుతో కళకళలాడు తోంది. పండిట్ నెహ్రూ విమానంనుంచి దిగగానే భూమ్యాకాశాలు కలిసేటట్లు జయజయ ధ్వానాలు చెలరేగాయి. ఆ ప్రజాసమూహాన్ని తోసుకుంటూ ఆతురతతో జనాబ్ జిన్నా ముందుకు వచ్చి నిలబడ్డాడు. ఎంతో ఆప్యాయంగా నెహ్రూ జిన్నాలు కౌగిలించుకున్నారు. హిందూ ఔర్ ముస్లిం ఏక్ హో అన్న నినాదంలో ఆ అన్నదమ్ములు యేం మాట్లాడుకున్నారో వినపడ లేదు; మతాబుల్లోంచి ముత్యాలు రాలినట్లు మాత్రం కన్పించాయి.

ఢిల్లీ సెక్రటేరియట్ భవనం నూతన శోభతో వెలుగొందుతోంది. దానిపైన త్రివర్ణ పతాకం ప్రపంచాన్నే ధిక్కరిస్తున్నట్లు నాట్యమాడుతోంది సింహద్వారం పోర్టికో క్రిందకు పెద్ద కారు వచ్చి ఆగింది. కారులోపల లార్డువేవెల్ ఒక్కడే అయినా వెనకాల కేరియర్ మీదా సైప్నీల మీదా మొయ్యలేనంత సామాను. పండిట్ నెహ్రూ, జిన్నాసాహేబ్, గఫూర్‌ఖాన్, బలదేవ్‌సింగ్, సరోజనీ దేవి మునిముని నవ్వులతో కారు చుట్టూచేరారు. అంతా హృదయ పూర్వకంగా వేవెల్ దొరకు కరస్పర్శచేసారు. నిండు మనస్సుతో యిచ్చిన వీడ్కోలుకి వేవెల్ వుప్పొంగి పోయాడు. వారంతా "గుడ్‌బై" అంటోండగానే కారు స్టార్టయింది తారాజువ్వలాగ.



మావిడి తోరణాలతో భంగీగూడెం భూతల స్వర్గంలావుంది. అనన్య దేశాల ప్రతినిధులు, రాయబారులూ—లార్డ్ హాలిఫాక్స్ బిర్నిస్, సిద్కిపాషా సూంగ్, మోలటోవ్, స్మట్స్ ఒకరేమిటి, నానాజాతి సమితి ప్రత్యక్షమయినట్లుంది. ఆ గుడిసెలో అరుగులమీద పేర్చిన అముదపు దీప ప్రతిమలు లోకాన్నే ప్రకాశింప జేస్తున్నాయి. నానా రాజ్య ప్రతి నిధులు ఒకరి తరువాత ఒకరు లేచి రిపబ్లిక్ అధ్యక్షుడు సుభాష్ చంద్రునకు వారివారి ప్రభుత్వాలు యిచ్చిన అధికార పత్రాలు సమర్పించారు. వాటిని స్వీకరించే ముందు యీ మైనపు వత్తిమీద గుగ్గిలం వేసి నరకాసుని ద్రుంచిన భగవానునికి మ్రొక్కుము బేటా అంటూ బాపూజీ నోరుతోనవ్వాడు.

ఎన్నాళ్లకు సిసలైన దీపావళిని చూడ గలిగామని అనుకుంటూండగానే వార్తా పత్రిక వాడు సైకిల్ బెల్ వాయించి నిద్ర మేల్కొల్పాడు. పత్రికను తెరవగానే పెద్ద అక్షరాలతో శీర్షికలు ప్రత్యక్ష మయాయి. ఫ్రాంటియర్‌లో జవహర్లాల్‌కు నల్ల జండాలు. జిన్నా ఢిల్లీలో యుద్ధం ప్రకటించాడు. బెంగాల్ ప్రజకు ఘోరమైన విపత్తు. తెలుగు నాడులో ఆకలి మంటలు. కలలెంత నిజమో పండుగలు గూడా అంతే!

★

శ్రీ నిర్మలాదేవి గ్రంథాలయము

సాధారణముగ మనము నామకరణ అక్షరాభ్యాసములవంటి శుభకార్యములను మహర్నవమి విజయదశమి రోజుల్లో జరుపుతాము. ఆ విధముగానే యిన్ని రోజులనుండి ఆంధ్ర మహిళా సభ గ్రంధాలయ మని వ్యవహరింపబడుతున్న గ్రంధాలయము మొన్న మహర్నవమి (4-10-'46) నాడు శ్రీ నిర్మలాదేవి గ్రంధాలయమని పేరు పెట్టుకున్నది. ఆంధ్ర దేశ గ్రందాలయ సంఘ అధ్యక్షులయిన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుపంతులు గారు గ్రంధాలయ ప్రారంభోత్సవమును జరిపినారు. "విద్యా వివేకములను పెంపొందించు కోవటానికి, మానసిక వికాసమునకు గ్రంధాలయములు ఉత్తమ సాధనములు. ఇంకా పురుషులన్నా అయితే బయట పనిపాటలు చూసుకుంటు పదిమందితో తిరుగుతారు కాబట్టి వారికి ప్రపంచ జ్ఞానము సంపాదించుకోవటానికి చాల అవకాశములు సదుపాయములు వున్నవి. కాని స్త్రీలు సాధారణముగ యింటి పట్టునే వుంటారు. అందువల్ల గ్రంధాలు, పత్రికలు వారికి కాలక్షేపమునకు, మనోవికాసమునకు కూడ తోడ్పడుతవి. బహుళముగా గ్రంధపఠన చేసి లాభము పొందటానికి గ్రంధాలయములే తగిన సాధనము. అందులోను ప్రత్యేకించి స్త్రీలకు ఏర్పాటుచేసిన గ్రంధాలయములు మరింత సహకరించుతవి. సమాజములో తమ ఉన్నతికి అభ్యుదయానికి పాటుపడుతు ముందుకు నడుస్తున్న రోజుల్లో స్త్రీలు గ్రంధాలయములను విరివిగా ఉపయోగించుకోవాలి. తన శక్తినంతను సంస్థకు ధారపోసిన స్వర్గీయ నిర్మలాదేవి పేరిట విద్యావిజ్ఞాన దాయకమైన గ్రంధాలయమును స్థాపించటము ఎంతో సమంజసముగా వున్నది. ఆమె చేసిన సేవలకు గుర్తుగా యీ గ్రంధాలయము చిరంజీవిగా వర్థిల్లు గాక ! ఇది ఒక ఆదర్శ గ్రంధాలయమై చెన్నపురిలోను స్త్రీ పురుషులందరికి కూడ సమానముగ తోడ్పడగలదని నా ఆశయము" అని అధ్యక్షులు నుడివిరి.

గ్రంధాలయ కార్యకలాపములను నిబంధనలను సూచించిన తరువాత మహిళాసభ తరఫున అచిరకాలములోనే ఆంధ్ర దేశ గ్రంధాలయ సంఘము వారి ఆధ్వర్యమున లైబ్రేరియనులకు తరగతులు ఏర్పాటు చేయవలెనను ఉద్దేశమును గ్రంధాలయ కార్యదర్శిని ఎరుకపరచినది. శ్రీమతి పి. భాస్కరమ్మగారు గ్రంధాలయానికి 100 రూ. విరాళము, శ్రీమతులు కొమ్మూరి పద్మావతీ దేవిగారు, పట్టిగొండ విశాలాక్షిగారు, పొత్తూరి కామేశ్వరమ్మగారు, శ్రీయుత పి. పేర్రాజుగారు గ్రంధాలయానికి చాల పుస్తకములను వాగ్దానము చేశారు. గ్రంధాలయము, దాని అనుబంధమైన పఠనమందిరము ప్రతి రోజు ఉదయము 8 గం॥ నుంచి సాయంత్రము 6 గం॥ల వరకు తెరిచివుంటవి. సభ సభ్యురాండ్రు విద్యార్థినులు యే విధమైన చందాలు, డెపాజిట్లు లేక ఉచితముగా గ్రంధాలయ పఠనమందిరములను ఉపయోగించుకోవచ్చును.

—అ. గిరిజ, గ్రంధాలయ కార్యదర్శిని.

★

చందాదారులకు విజ్ఞప్తి

ఈనెల కాగితం పెర్మిట్ ఆలస్యంగా అందడంచేత యీ సంచికను సకాలంలో ప్రచురింప లేకపోయాం. దీనికి పాఠకులు మన్నించాలి. నవంబరు సంచిక 15 వ తేదీకే విడుదల చేయడానికీ, డిసెంబరు నుండీ ప్రతీనెలా 1 వ తేదీకే "ఆంధ్ర మహిళ"ను ప్రచురించడానికీ ఏర్పాట్లు జరిగాయని విన్నవిస్తున్నాము.

—సంపాదకురాలు.

★

ప్రార్ధనా గీతము

శ్రీ శ్రీ శ్రీ మహారాణీ ఆర్. వి. యల్. చిన్నమాంబగారు

(శ్రీ స్వర్గీయ రాణీరావు వేంకటలక్ష్మీ చిన్నమాంబ, పిఠాపురం మహారాణీవారిచే రచింపబడ్డ ప్రార్థనాగీత మిది. వారు రచించిన ఇలాంటి పూలమాలికలూ, కవితా గుచ్ఛాలూ ఎన్ని మనకు తెలియరాకుండా అజ్ఞాతవాసంలో ఉండిపోయేయో—ఇదొక్కటి మనకు లభించింది. 'ఆంధ్ర మహిళ' దీన్ని ప్రకటించగలిగినందుకు ఆనందిస్తూ వుంది.)

శ్రీశు విఘ్ననాశుని
శ్రిత జన మందారుని
కేశవుమాధవునాద్యుని
కేలు మొగిచి కొలుతము ॥ శ్రీ ॥

చిత్తమలర స్త్రీజనంబు
చేరియుచట గుములుగూడి
బత్తిమిగుల నాడుమదిని
పాడియాడుచుం గోరుచు

యేలిపట్టువస్త్రములను
మెలంతలెల్ల గట్టియిపుడు
తేలియాడుచు మోదజలధి
తిరుగుచుండిరి శివిని ॥ శ్రీ ॥

జిలుగుచిత్ర వర్ణమిళిత
చీరలెంతొ వింతం దాల్చి
కలకలనాదములు సెలంగ
గాంతలెల్లరుం బ్రీతిని ॥ శ్రీ ॥

రత్నభూషణములు దాల్చి
రాజకాంతలెల్లం దమిని
యత్నములను చేసిరప్పు
డతిథిపూజసల్పగ ॥

నవ్యవిధములయిన విలువ
నగలదొడగినారలెల్ల
దివ్యవైభవమునవచ్చి
తీర్చిరిచ్చటం గొలువును ॥

బంధుమిత్రజనులుబలిసి
ప్రార్థనములు సలుప నెంచి
బంధురమగు దీక్షబూని
భామలెల్లరుం గూడుచు ॥ శ్రీ ॥

హస్తపంకజములు మోడ్చి
యక్షికమలములనుమూసి
మస్తకముల నిల్చివాంచి
మాన్యప్రార్థన సలుపుచు ॥

శుభములందు నెట్టివిఘ్న
క్షోభకలుగకుండగోరి
యభవు వేడుచు నేకరీతి
నైకమత్యముజూపుచు ॥ శ్రీ ॥

హిందువులకు నెల్లకడల
నెట్టియుత్సవముల నైన
బంధువులతొం గూడి దైవ
ప్రార్థనములు సేతురు.

ఆంధ్ర మహిళాసభ దసరా ఉత్సవాలు

ఆంధ్ర మహిళాసభ సభ్యురాండ్రు దసరా ఉత్సవాలు సొంత భవనాల్లో అక్టోబరు 2 వ తేదీనుండి 5 వ తేదీ వరకు జయప్రదంగా జరిపారు. నిత్యం ప్రొద్దుట దేవీ పూజ విధిగా జరిపేరు. బొమ్మల కొలువు అన్ని రోజులూ ఉంది.

అక్టోబరు 2 వ తేదీని భావిభారత నిర్మాత గాంధీజీ జన్మ దినోత్సవంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం దేవీ పూజానంతరం నూలు వడకు పోటీ జరిగింది. చాలా మంది సభ్యురాండ్రు, విద్యార్థినులు పోటీలో పాల్గొన్నారు. శ్రీమతి జి. అనసూయగారు ప్రథమ బహుమానము, శ్రీమతి ఆదిలక్ష్మమ్మగారు ద్వితీయ బహుమానము పొందేరు.

3 వ తేదీ ఉదయం దేవీ పూజ, సాయంకాలం తెలుగు వాగ్వివాద పోటీ జరిగింది. "ఇప్పటి విద్యావిధానం స్త్రీలకు ఉపయోగకరంగా లేదు" అన్న విషయాన్ని గురించి సభ్యురాండ్రనూ "స్త్రీలకు అధికారాలకంటె అవకాశాలు ఎక్కువ కావాలి" అన్న విషయాన్ని గురించి విద్యార్థినుల్నీ మాట్లాడమన్నారు. శ్రీమతి బాలాంత్రపు శేషమ్మగారు, శ్రీ బాలాంత్రపు వెంకటరావుగారు నిర్ణేతలుగా ఉన్నారు. సభ్యురాండ్రలో మొదటి బహుమానం శ్రీమతి అచ్యుతుని గిరిజగారికి, రెండవ బహుమానం శ్రీమతి కె. సుగుణమణిగారికి యిచ్చేరు. విద్యార్థినుల్లో ప్రథమ బహుమతి శ్రీమతి రత్తమ్మగారికి, రెండవది శ్రీమతి ఎ. జయలక్ష్మిగారికి వచ్చాయి. ఆ వెనుక సభా బాలికలు "రాధాకృష్ణ" నాటిక అతి రమ్యంగా ప్రదర్శించారు. ఇందు పాల్గొన్న బాలికలందర్నీ ప్రశంసించ వలసిందే. రాధ పాత్రధారిణి చిరంజీవి ఓరుమళ్ల జానకి ప్రత్యేక బహుమతి పొందింది.

4వ తారీఖు ప్రొద్దుట దేవీపూజ, సాయంకాలం హిందీలో వ్యాస రచన, వాగ్వివాద పోటీలు జరిగేయి. "స్త్రీ శిక్ష" "గాంధీజీ చేసిన సేవ" "హిందూ సంఘంలోని దురాచారాలు" అన్న విషయాలు చర్చించడానికీ, "స్త్రీలు ఏ ఏ రంగాల్లో కృషి చేయవచ్చు" అన్న శీర్షిక క్రింద వ్యాస రచన గావించడానికీ, ప్రవేశిక, విశారద విద్యార్థినులకు యిచ్చేరు. 'దసరా' అన్న విషయాన్ని గురించిన వ్యాస రచన రాష్ట్ర భాష విద్యార్థినులకు యిచ్చేరు. శ్రీ అవస్థేజీ, శ్రీ శ్రీకంఠమూర్తిగారు నిర్ణేతలుగా నుండి, శ్రీమతి అంబుజవల్లి, రత్తమ్మగార్లకు వాగ్వివాద పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు నిర్ణయించేరు. వ్యాస రచనలో శ్రీమతి అంబుజవల్లిగారికి, రాష్ట్ర భాష విద్యార్థినులలో చిరంజీవి వి. రుక్మిణికి ప్రైజు లిచ్చేరు. ప్రాథమిక విద్యార్థినుల్లో శ్రీమతి కోటేశ్వరమ్మగారికి ప్రథమ బహుమానం వచ్చింది. తదనంతరం స్వర్గీయ నిర్మలా దేవి స్మారక చిహ్నంగా నెలకొల్పిన గ్రంథాలయ ప్రారంభోత్సవం శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారి అధ్వర్యాన్న జరిగింది. ఆ వెనుక హిందీలో "పూజారి" అనే నాటకం, సభలోని హిందీ విద్యార్థినులు ప్రదర్శించేరు. హిందీలోకూడ మనవారు అందె వేసిన చేతులనిపించేరు. ఇందు రాంగ పాత్రధారిణి చిరంజీవి భాగవతుల పద్మకు ప్రథమ బహుమానం, పూజారి వేషధారిణి చిరంజీవి గోపరాజుమైత్రికి ద్వితీయ బహుమానం యిచ్చి ప్రశంసించేరు.

5 వ తేదీ ఉదయం దేవీ పూజ జరిగింది. సాయంత్రం సభా బాలికలు "వినోద వేషాల్లో" పాల్గొన్నారు. శ్రీమతి చంద్రాననబాయిగారు, శ్రీమతి దిగుమర్తి బుచ్చికృష్ణగారు శ్రీమతి మంత్రిప్రగడ రంగనాయకమ్మగారు నిర్ణేతలుగానుండి విద్యార్థినుల్లో సోదిమనిషి వేషం ధరించిన శ్రీమతి కె. రాజేశ్వరిగారికి ప్రథమ బహుమానం, కోమటి వేషం వేసిన చిరంజీవి వనమాలి రుక్మిణికి ద్వితీయ బహుమానం, చిన్న పిల్లలలో చిరంజీవి రవీ, రమేష్‌లకు ప్రథమ ద్వితీయ బహుమానాలు నిర్ణయించేరు. ఆ తర్వాత సభా బాలికలు "పోస్టుమాస్టర్" ప్రహసనం చక్కగా ప్రదర్శించి ప్రేక్షకుల కడుపులు చెక్కలయేటట్టు నవ్వించారు. ఆ ఫార్సులో బంట్రోతు వేషంవేసి చాల స్వాభావికంగా నటించిన చిరంజీవి ఎర్రమిల్లి వసంతకు ప్రత్యేక బహుమానం యిచ్చారు. తర్వాత చిరంజీవి గిరిజ భరతనాట్యంచేసింది. ఆమె నటనా కౌశల్యాన్ని ప్రశంసిస్తూ ఒక ప్రత్యేక బహుమానం యిచ్చారు. తదనంతరం శ్రీమతి పప్పు కామాక్షమ్మగారు బహుమతులు పంచి పెట్టడంతో దసరా ఉత్సవ కార్యక్రమం ముగిసింది.

★

దసరా ఉత్సవాలు

శ్రీమతి తురగా అన్నపూర్ణాదేవి (ఆంధ్ర మహిళాసభ విద్యార్థిని)

క్రిందటి దసరాలు ఏ విధంగా జరిగేయో అందరికీ తెలుసుగదా! ఆ రోజుల్లో ఆయుధ పూజలే జరిగేయి. నిజంగా ప్రపంచంయెన్నడూ యెదుర్కోని మహాసంగ్రామంలోకి దూకింది. ప్రజలందరూ తమ ప్రాణాల్ని గుప్పిట్లో పెట్టుకొన్నారు. యీ యుద్ధం భారతదేశం మీద చాలా కక్ష తీర్చుకుంది. ఈ దసరా సమయంలో మన తోడి సోదరసోదరీమణులు అన్నానికీ, బట్టకూ మొహంవాచి జబ్బులకు లోబడి మారణ దేవతకు ఆహుతై పోయినవారు లక్షల మంది వున్నారు కదా! వచ్చే ఆదాయాలు అవసర వస్తువుల ఖరీదులకే చాలకుండా ఉన్నాయి. ఇక మనకు విలాస వస్తువులు ఎక్కడనుంచి వస్తాయి? పండగలకు మన తల్లిదండ్రులు మనల్ని పూర్తిగా తృప్తిపరచ లేరని విచారిస్తే లాభమేమిటి. దేశం యెంత దుస్థితిలో ఉందో ఒకమారు ఆలోచించండి. యుద్ధ కారణాలవల్ల జపాను మొదలైన ఇతర దేశాలనుంచి మనకు కావలసిన విలాస వినోద వస్తువులు రాలేదు. ఉన్నవి ఖరీదు. దానికి మనం విచారించడం భావ్యంగాదు! ఈ రేషను, కంట్రోలు విధానంవల్ల తిను బండారాలకే కరువు యేర్పడినప్పుడు ఇక విలాస వస్తువులు లేవనా విచారించేది!

ఎక్కడ చూచినా దసరా ఉత్సవాల్లో బొమ్మల్ని పెట్టి పూజలు చేసి విరివిగా డబ్బుకర్చు పెడుతున్నాం గాని ఈ పూజలు జరగవలసిన చోటనే ఇప్పుడు "ఓ దేవీ అన్నం, అన్నం" అని అలమటించేవారూ "వస్త్రం, వస్త్రం" అని యాచన చేసేవారూ ఎందరు? మనతోటి సోదరీమణులు తిన తిండి, కట్ట బట్ట లేక ఇంత బాధపడుతుంటే మనం ఇంకా విలాస వస్తువులు కోరడంలో ఏమైనా అర్థం ఉందా? ఇంతకూ యీ పరిస్థితులు యేర్పడ్డానికేమి కారణాలో ఆలోచించారా? ఈ ఆహాకారాలకీ ఈ సమరాలకీ కారణం దేశ పరిస్థితుల్నీ దాని నగ్న రహస్యాల్నీ అర్థం చేసుకోలేక పోవడమేను.

బ్రిటిష్‌వారు మనపై మహాజాలి ఉన్నట్లు మాట్లాడి కన్నీళ్లు తుడిచి ఇదిగో అదుగో ఆహారపు ఓడలు వస్తున్నాయని ఓదారుస్తున్నారు. గాని మనకే జాతీయ ప్రభుత్వమే ఉంటే? ఈ క్షామాలు రాక పోయేవేమో. జాతీయ ప్రభుత్వం అంటే మన క్షేమం కోసరం సర్వ త్యాగాలు చేస్తున్న (ఇలాంటిది మనకు యిటీవలనే వచ్చింది.) మన దేశ నాయకుల పరిపాలన. భారతీయులమైన మన స్థితి యుద్ధం ముగిసినా ఎప్పటిలాగే యుంది. మనకు జాతీయ ప్రభుత్వం వచ్చినా స్వరాజ్యం ఇంకా రాలేదు. అలాంటప్పుడు ఈ దసరా మనకు సంతోషాన్ని కలిగించదు, వచ్చే దసరాలకైనా మనం ఈ పరిస్థితులనుంచి దాటడం అవసరం. ఇందుకు రెండు చక్కటి సులభ మార్గాలున్నాయి. ఒకటి సోదరి రాట్నారాధన గావించడం. రెండవది సోదరులు భూదేవినీ నాగలినీ ఆరాధించడం. ఆలా మనసారా ప్రతీ భారతీయుడు భారత యువతీ ఆరాధిస్తే వచ్చే దసరాకైనా మన బట్టా, మన అన్నం మనం ఉత్పత్తి చేసుకుని తృప్తిగా ఉండొచ్చు. తిండికీ, బట్టకూ ఒకరి మీద ఆధారపడక పోవడం చాల గొప్ప విషయం. కడుపు నిండితే వాటంతట అవే క్రొత్త ఊహలు పుట్టుకు వచ్చి మన విలాసాలకు కావలసిన వస్తువులు మనం చేసుకోగలం. ఈ పద్ధతిని, పునర్నిర్మాణం జరగాలి; కొంత జరిగింది. గాని ముఖ్యంగా మన బాలికల తర్ఫీదు విషయంలో జరగవలసిన మార్పులు చాలా ఉన్నాయి. బ్రిటిష్ వారు మన దేశంలో అధికారం ప్రారంభించిన నాటినుంచీ ప్రవేశ పెట్టిన విద్య ముఖ్యంగా మనల్ని

ముందు సంవత్సరం "ప్రోగ్రాము" ఎల్లా వుండాలి?

గుమాస్తాలగా చెయ్యడాన్కి పనికొస్తుంది. మన కున్న శక్తినంతనీ పీల్చి పిప్పిచేసే శక్తి దానికి ఉంది. కేవలం సోదరులే కాక సోదరీమణులుకూడా దీనికి వ్యామోహపడు తున్నారు. ఏ కొద్దిమందికో తప్ప ఈ విద్యలో ఒక్క గుమాస్తాగా ధనార్జన చేయుటవరకే గలదు. అంటే ఆంగ్లం చదవరాదని గాదు దీని భావం. ఇది రాజకీయభాషగా ఆంగ్ల భాష నభ్యసించ వచ్చు గాని దీనికి ప్రాధాన్యతయిచ్చి మాతృ భాషను అశ్రద్ధ చేయడం తగదు.

స్వతంత్ర జీవితాన్ని గడపడానికి సామర్థ్యవంతుల్నిగా చేసే విద్యలు మనకు కావాలి. చూడండి ఇతర దేశీయులు తమ తమ భాషలు ఆచారాలు ఒదిలి పెట్టేరా? మనకా విధానం లేక పోవడం చాల శోచనీయాంశం. గాంధీజీ యిప్పుడు మన కళ్లు తెరిచేడు; ఈ రోజుల్లో కొందరు విదేశీయుల పాలనా విధానాన్ని దానివల్ల జరిగే అన్యాయాల్ని కొంత గ్రహించి విప్లవాన్ని సాగిస్తున్నారు. మనం కూడా జంకులేకుండా పెద్దలకు సాయపడాలి. మనకు విజ్ఞానాన్ని యిచ్చి, మనం అభిలాషపడుతున్న పంథాలో మనల్ని నడిపించే అధికార వర్గం రావాలని మనమంతా ఈ దేవీ పూజల్లోనేగాదు నిత్యమూ ప్రార్థన గావించవలసిందే. మన కాళ్లమీద మనం నిలవాలంటే—మన భావి అభ్యుదయ విధానం అంతా గాంధీజీ సూత్రాల ప్రకారం మారాలి.

మనమంతా ఊరూరా తిరిగి దేశసేవ చేయగల దేశభక్తులం కాలేకపోయినా, గొప్పగొప్ప పనులు చేయలేక పోయినా ఉడుత భక్తిలా మనకి కావలసిన అవసరాలు ఏ కొద్దిగానైనా మనమే ఉత్పత్తి చేసుకోగలిగితే చాలు ఇందుకు ఎవరి శక్తికొలది వారు కృషి చేసినా దేశసేవయే ఔతుంది. ఒక్క పురుషుడువల్లా అంతాగాదు, ఒక్క స్త్రీవల్లా అంతా గాదు. పురుషులు కొన్ని వాటిల్లో ప్రవీణులు, మనమూ కొన్నింటిలో ప్రవీణులం. చూడండి (1) ఇంట్లో తల్లి అన్నం వండి, అందరికీ సమానంగా పెట్టినట్లు తండ్రి పెట్టగలడా? అతను పెట్ట ప్రయత్నిస్తే ఏమవుతుందో తెలుసా! పాపం గిన్నిలో చాలా కనపడుతుంది, ముందు వచ్చిన వారికి చాలా పెడతాడు, తరువాత వారికి ఏమీ మిగలదు! ఇది అతని పక్షపాత బుద్ధివల్ల గాదు, అతనిలో మాతృత్వం లేక పోవడంవల్లనే. (2) నర్సింగ్ పని చూడండి: ఇది స్త్రీ చేయ గలిగినట్లు పురుషుడు చేయగలడా? ప్రతి పురుషుడికి తన బిడ్డకు వలె సేవ చేయగల ఓర్పు ఆమెకే గలదు. అందుచేత ముఖ్యంగా ఆహార శాఖలోనూ, వైద్యం లేక నర్సింగ్ లోను ఎక్కువ తర్ఫీదు మనకు కావాలి. వీటికి ముందు మనం సాధన చేయాలి. ఇందుకు అందరికీ తెలిసిన ఒక భాష రాజకీయ భాష ఆవశ్యకం. చూడండి: మనం ఆంధ్ర దేశంలో అన్ని విద్యలూ ఉన్న పాఠశాలలు ఎన్ని వున్నాయి? సీతానగరం, మద్రాసు వగైరా ప్రాంతాల్లో నేత, నూలు మొదలైన పరిశ్రమలు నేర్పుతున్నారు. ఇల్లాంటి శిక్షణ కేంద్రాలు ఇంకా చాలా చోట్ల అవసరం. ఎందుకంటే అందరూ మద్రాస్ గాని సీతానగరంగాని వచ్చి నేర్చుకోలేరు గదా! ఈ కరువులో ఒక చీర 25 రూ. పెట్టి సామాన్యులు కొనుక్కోగలరా? ఇంటిలో ఒక్కని సంపాదనవల్ల ఎంతమంది పోషింపబడుతూ ఆధారపడి ఉన్నామో అతనికి మనం ఏ విధంగా సహాయం చేస్తున్నామో ఆలోచించి చూడండి: ఎంత బాధగా యుంటుందో. అందుచేత ఒక్క రాట్నం ఇంట్లో పెట్టుకుంటే ఎంత లాభమో ఆలోచించండి. ఈలాంటి చేతి పనుల్ని మనకు బోధించి, మన భావి జీవితానికి మార్గాలు చూపిస్తున్న ఆంధ్ర మహిళాసభా స్థాపకులవంటి తల్లులు ప్రస్తుత విధానంలో మార్పులు విరివిగా చేయిస్తారని మా కోరిక. మనమంతా మన చేతితో తయారు చేసుకున్న బట్టల్నీ మన స్వంత పనులతో తయారు చేసుకున్న యితర వస్తువుల్నీ వచ్చే దసరాలకు అలంకరించుకొందాం. సోదరీమణులంతా ఈ మాదిరిగా దసరాలు జరపడానికి అంగీకరిస్తారని నమ్ముదాం. ఇలాంటివే మన భావి జీవితపు కర్తవ్యాలూ ఆశయాలూ పూజలూ అయిఉండా లని మనవి చేస్తున్నాను.

వృంతంకు 'ఫ్రాక్చర్'

శేషు మా పెద్దమ్మాయి. ఆమె పూరా పేరు శేషమాంబ. పొట్టివాళ్ల మధ్య పొడగరి. పొడుగువాళ్ల మధ్య పొట్టి. నవ్విందా అంటే కిలకిలానవ్వి ఇల్లంతా మెఱయిస్తుంది. పలికిందా అంటే ఇంట్లో గంగాళాలు మారు మ్రోగి తీరుతాయి. కూర్చుంటే మూలమూలల కొదిగి కూర్చుంటుంది. పాడేటప్పుడు ఇక ఆ వినయానికి ఆ వినయమే సాటవ.

ఆమె తన భర్త యింటికి వెళ్లిన యీ తరువాత మా యిల్లు సవరించుకోబోతే ఎక్కడ చూచినా ఆమె వ్రాసిన పద్దుకాగితాలే. ఎక్కడ చదివినా ఆమె వ్రాసికొన్న పాటలే.

జలపాతం ముందు మనం నిలబడితే మన రూపం ఆ ఉదకంలో ప్రతి బింబించి తీరుతుంది అనే నమ్మకం పాఠకులకు వున్నట్టాయినా, నా కన్నీళ్లల్లో ఆమె. నేడు ప్రతి ఫలిస్తూ వుందని నమ్మండి. కణ్వుడు సన్యాసి కావడంచేతను తన కళ్లు చెమ్మగిల్లి నప్పుడు వెంటనే కావి దుకూలాన్ని అద్దుకుని సమాధాన పడగలిగాడు. నాకు వైరాగ్యం అంటే ఏమిటో సుతరాం తెలియదు. ఆ కారణంచేత రైలుబండి రాజమండ్రి స్టేషన్ విడిచి పెట్టి పట్టాలమ్మటే వెడుతూ కూస్తూవుంటే, నేను నా అరుగు మీద తెలతెలవాఱగట్ల పన్నుండి వింటూ, "తలగడ మీదకు పడ్డ కన్నీళ్లు కళ్లవా, హృదయానివా ?" అనే తలపోతను మునిగి పోయాను. కాని ఒక్కొక్క అనుభవము నా ఊహాపథాన్ని ఒక్కొక్క కంకరరాయి. నూతన దార్ఢ్యం అలవడింది. దృష్టి తేరుకుంది. ఈ విధంగా వ్రాయడానికి బలం చేకూరింది.

నేను ఏ యిల్లు అద్దెకు పుచ్చుకొన్నా ఆ యిల్లు అద్దెకు పుచ్చుకున్న యింటిలా భావించక సొంతయిల్లులా తలపోసికొంటూ, ఇంటి ముందో, ఇంటి వెనుకో ఒక చిన్న పూల తోట వేసి పూలు పూయించడం పరిపాటి, ఈ పువ్వుల్ని మొక్కల్ని ఎవళ్లు పాడుచేసి పోతారో ఏ మేకలు తిని పోతాయో అని ఆ తోటకు చుట్టూ కంచె వేసి కాస్తూ వుండేవాడ్ని కూడాను. పువ్వుల యొక్క క్షేమం నిమిత్తంగాను నేను పెద్ద డిసిప్లినేరియన్ను అయిపోక తప్పింది కాదు.

ఇంటిల్లిపాదికీ వుత్తరు వొకటి జారీ చేశాను "ఎవళ్లూ కూడా నే పాతిన తోటలోకి అడుగు పెట్టకూడదని, అందులో పూచే పువ్వులు ముట్టుకోకూడదని." అప్పటికి ఈ ప్రస్తావనలో నా చేత చిత్రింపబడే పిల్ల మిక్కిలీ చిన్న పిల్ల. శైశవంకూడా దాటి వుండదని నాకు జ్ఞాపకం; కాని నడక అబ్బి కుప్పిగంతులు వేస్తూ సాహసం చనువు వచ్చిన చుట్టాలకూ మాకూ కాపరస్తూ వుండేది.

ఒక సాయంకాలం నేను వీథిలోకి వెళ్లి యింటికి తిరిగి వచ్చేలో తల్లినుండి. పెద్ద రిపోర్టు "మటి శేషు తోట కంచె ఎక్కి ముందుకు పడి చేయి విరగ్గొట్టుకుంది. వెంటనే డాక్టరుగారి దగ్గఱకు పంపి బద్దలు వేయింపించి చేతికి మోసం లేకుండా కాపాడాను." అంది.

నేను ఆ విరిగిన చేతిని పరీక్షించ కుండానే, వెళ్లి తోట పరిశీలించాను. తోటలో, ఒక పూవుతొడిమ విరిగి మొక్క నుండి వేఱు పడ్డట్టు కాపడింది. నా చూపుల్లోని భావం ఆ చిన్ని పిల్ల తెలిసికొండేమో 'ఏది?' అని అడుగుతాననో, నా దగ్గఱకు పరుగెత్తుకుంటూ వచ్చి "డాక్టరుగారితో ఆ పువ్వును విరిగిన తొడిమను కలిపి బద్దల్లో వేసి కట్టివేయమన్నాను. ఆయన చిరునవ్వునవ్వుతూ అసలు నీ చేతికే ఫ్రాక్చర్ లేదు. పువ్వున కెక్కడనుంచి ఫ్రాక్చర్ వస్తుంది? అంటూ పువును తొడిమను ఈ బద్దల మధ్యను పెట్టి బంధించారు." అంది.

ఆమె జవాబుకు నేను మిక్కిలి సిగ్గుపడిపోయినాను. నాటినుండీ తోటకు కంచె తీసివేసి ఎవరికి కావలసిన పువ్వులు వాళ్లు కోసుకోవలసినదిగా కోరినాను.

కనుపాప నీడలు ★ రచన: శ్రీ కవికొండల వెంకటరావుగారు

కలం — కత్తి

శక్తి యొక్క స్వరూపాలు!

దేశాభ్యుదయానికి రెండూ కావాలి!

★

చర్చలో పాల్గొన్నవారు:

శ్రీమతి సుశీలాదేవి, అంబుజవల్లి, భాగీరథి, రత్నమ్మ, అనసూయ,

అన్నపూర్ణ, గిరిజ, మైత్రి, శేషాద్రమ్మ, దుర్గాబాయి

అధ్యక్షులు: శ్రీకంఠమూర్తిగారు

★

ఆంధ్ర మహిళా సభ హిందీ వాగ్వర్ధినీ శాఖ 25వ సమావేశం 14-9-46 సాయంత్రం 4½ గంటలకు శ్రీయుత శ్రీకంఠమూర్తిగారి అధ్యక్షతను జరిగింది. సభ బాలికల 'ప్రార్థన'తో కార్యక్రమం ప్రారంభమైంది. గత సమావేశపు నివేదికను చదివేక "కత్తికంటె కలం గొప్పది" అన్న నాటి చర్చావిషయం ప్రస్తావించబడింది.

శ్రీమతి కె. సుశీలాదేవిగారు:—"నేటి ప్రపంచములో కత్తిలో 'బలం' లేదు. దాని యొక్క నిరుపయోగత 20వ శతాబ్దిలో జరిగినటువంటి రెండు యుద్ధాలలో వెల్లడియైంది. కత్తి ద్వారా శాంతి స్థాపన అసంభవం కాని, కలము యొక్క శక్తి అపారమైంది. కత్తి యొక్క ప్రభావం నాశనమే. కాని కలములో సృజనాత్మక శక్తి వుంది. రక్తపాతంతోటే పశుబలం కన్నా కలమే మేటియైనదని ఉపపాదించేరు.

శ్రీమతి అంబుజవల్లిగారు:—కలంలో సాటిలేనటువంటి శక్తి వుంది. విద్యా ప్రచారం చేయడానికి, జనుల్లో జ్ఞానం అభివృద్ధి చేయడానికి నిద్రావస్థలో నున్నటువంటి బానిస దేశంలో జాగృతి రేకెత్తించడానికి ప్రభావశాలియైన సాధనం కలమే. కత్తిని జూస్తే ప్రజల హృదయంలో భయం, ద్వేషం కలుగుతుంది. కాని పరస్పర ప్రేమ, స్నేహభావాలు కలం ద్వారానే సంభవం" అని ఉపపాదనను బలపరచేరు.

శ్రీమతులు భాగీరథి, రత్నమ్మ, అనసూయ, అన్నపూర్ణగార్లు కూడ ఈ పక్షాన్నే మాట్లాడేరు.

శ్రీమతి గిరిజగారు:—ప్రపంచమొక రంగభూమి. వినాశంకూడ ప్రకృతి యొక్క నియమమే. దుష్టుల సంహారానికై దేవుడు కూడ యెన్నోమార్లు అస్త్రాలు ధరించాడు. భావావేశంచే ప్రజలు కలం యొక్క శక్తిని ప్రశంసిస్తారు. దానినే సాహిత్యం చరిత్రల యొక్క నిర్మాణానికి సాధనమంటారు. కాని, ప్రపంచంలోని విభిన్న జాతుల్లో కలహాలు లేక, సామ్రాజ్య స్థాపన, పతనాలు లేకపోయినట్లైతే, చరిత్ర, సాహిత్యాల నిర్మాణం యెలా సంభవిస్తుందీ? నిజంగా, అహింసా సిద్ధాంతం యొక్క ప్రచారమే నేటి భారత దుస్థితికి హేతువ"ని వుపపాదనను ఖండించారు.

శ్రీమతి మైత్రి:—"కత్తియే శాశ్వత కీర్తికి సాధనం. రాజులు, మహారాజులు, సామ్రాజ్యాలు స్థాపించారు. ప్రాచీన. భారత దేశంలో శాస్త్రాలు అధ్యయనము చేసే మునులు కూడ తమ యాశ్రమములోని ముని బాలురకు విలువిద్య మొదలైనవి నేర్పించే వారు. దీనికి కారణమేమిటంటే—కత్తిలో అపారమైన శక్తి యున్నదని వారు గ్రహించార"ని ఖండనను బలపరచారు.

శ్రీమతి శేషాద్రమ్మగారు కూడ ఈ పక్షాన్నే మాట్లాడారు. అంతటు సభికుల ఓటు తీసుకోగా అధిక సంఖ్యాకులు సమర్థన పక్షమున ఓటు చేసేరు.

శక్తియొక్క స్వరూపాలు


అధ్యక్షులగు శ్రీ శ్రీకంఠమూర్తిగారు :—కత్తీ, కలమూ రెండూ శక్తియొక్క స్వరూపాలే. కాని పూర్వం రోజుల్లో కత్తికున్నటువంటి శక్తి ఈ రోజుల్లో లేదనియే చెప్పవలసియుంది. ఎందుచేతనంటే ఈ కాలంలో పశుబలం కంటె, మానసిక శక్తికే యెక్కువ ప్రాముఖ్యత యివ్వబడుతోంది. కలం మానవాభ్యుదయం. సభ్యత యొక్క సాధనం. కాని కత్తిలో శక్తి యేమాత్రం లేదనుటకూడ కల్లయే. శ్రీరామ, శ్రీకృష్ణుల యవతారాలే దీనికి తార్కాణం. కాని వీటి శక్తుల్లో ఒక్క గొప్ప భేదమేమిటంటే కత్తియొక్క ప్రభావం త్వరగా కనపడినప్పటికి అది అస్థిరమైనది. కాని కలం యొక్క ప్రభావం శాశ్వతమైనద”ని వక్కాణించారు.

పిమ్మట శ్రీమతి దుర్గాబాయమ్మగారు మనోజ్ఞమైన భావాలతో వుపన్యసించేరు. రూఢి గ్రస్తమైన సమాజమూ, దేశాలలో మార్పు తీసుకు రావటానికి కలమూ, కత్తీ యావశ్యకాలే. అంధకారంలో మునిగి యున్నటువంటి దేశంలో జాగృతి రేకెత్తించే సాధనం కలం. కాని, ఈ జాగృతి కలిగిన పిమ్మట క్రాంతి తీసుకు రావాలంటే కత్తి కావాలిసిందే. కాని కలం యొక్క పని యెల్లప్పుడు సృజనాత్మకమైనదని విశ్వసించడం కూడ భ్రమయే! ఎందుచేతనంటే ప్రతికూల వాతావరణం కలిగించడానికి, “ప్రోపగేండా” (Propaganda) చేయడానికి కూడ కలం ఉపయోగిస్తూ వుండటం మన కందరికీ తెలిసిన విషయమే. కాబట్టి కలమూ, కత్తీ రెండింటిలోనూ మంచి గుణాలూ చెడ్డ గుణాలుకూడా ఉన్నాయని విశదీకరించేరు.

అభివందనాలతో నాటి సభ ముగిసింది.

— టి. సుశీల,
కార్యదర్శిని.

★



రాజ్యలక్ష్మీ పారిశ్రామిక విద్యాలయోపాధ్యాయినులు
—దసరా వుత్సవాలలో యేర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శనంలో ఒక దృశ్యం—

వంకలెంచే లోకం

"గట్టిగా మాట్లాడడమే గౌరవహాని" అని తలచే పెద్దలు వుపన్యాసాలిచ్చే ఆమెను చూచి వుత్సాహపడతారా? హింసిస్తారు. వీలైతే వెలివేస్తారు. ...ఈ నాడు శైశవ దశలో నున్న మీ సంఘాలను, ఏ మహా తల్లులో అష్టకష్టాలుపడి స్థాపించి జీవంపోసారు. అట్టి సంఘాల అభివృద్ధికై మీ జీవితాలను వినియోగించండి."

—డి. శ్రీనివాసరావు

ఆమెనేగాదు, ఆమెలాంటి వారందరిని వేలెట్టి చూపిస్తుంది వంకలెంచే లోకం. అభివృద్ధి పొందే వారిని గాంచి ఓర్వలేదు, పేరు ప్రఖ్యాతులు బడసేవారిని చూచి సహించ లేదు, ఈర్ష్యా పీడిత ప్రపంచం—అపవాదులు, నిందలు మోపి ఆత్మ సంతృప్తి బొందుతుంది. "అదిగో పులి" అని వినబడితే, "ఇది పులి తోకేగాబోలు" అనుకుంటారు నిజానిజాలు గమనించని ప్రజ. వింతలు మోసుకు పోయేవారికి అదొకసందు. ప్రచారం చేస్తారు.

చదువుకున్న దానవు నీవే సందేహిస్తే! తరతరాలనుంచి పురుషుడి స్వార్థ పరత్వానికి బలియై అతని అధికారానికి అణగి, మణగి మరల్లా పని చేస్తున్నా మీరు, ఈ నాడు నిజస్థితిని తెలుసుకుంటున్నారు. ఉన్నత స్థితికి మార్గాలు వెదుకుతున్నారు. ఈ మార్పులకు ఆమె, ఆమెలాంటి వారు కారణం.

వీధి అరుగు ఎక్కడమే తప్పుగా ఎంచే, హద్దుల నేర్ప రచిన సంఘం, వేదిక ఎక్కిన ఆమెను జూచి వేడుకపడుతుందా! నయాన్ని నీతులు బోధిస్తుంది. స్వార్థంతో నిండిన సంఘం, తన స్థానం స్థిరం చేసుకునేందుకు ఏనాడో సృష్టించింది, నీతులు, నియమాలు, నిర్ణయాలను పాటించే బానిసలకు హోదా యిచ్చింది. కథలల్లింది. కావ్యాలు సృష్టించింది. కళలను అంకిత మిచ్చింది.

"గట్టిగా మాట్లాడడమే గౌరవ హాని" అని తలచే పెద్దలు, వుపన్యాసా లిచ్చే ఆమెను చూచి వుత్సాహపడతారా! కళ్లెర్ర జేస్తారు. భయపెడ్తారు. అబలలని కూడా ఆలోచించరు. సాగితే దండిస్తారు. వీలైతే వెలివేస్తారు.

నయానికి లొంగక, భయానికి బెదరక, గంభీరోపన్యాసాలిచ్చే ఆమె పట్టుదలను చూచి పొగుడుతారనుకున్నావా! తమ్ము అధమ స్థితిలో నుంచిన సంఘాన్ని రూపుమాప ప్రయత్నించే, ఆమె కార్యక్రమాన్ని కొనియాడు తారనుకున్నావా! కల్ల! తాము సృష్టించిన చట్టాలను తృణీకరించి, తల యెత్తే తాడిత జాతిని దయతలచరు. తమ ఆటలు సాగవని తహతహలాడతారు. నిజాన్ని కప్పి పుచ్చుతారు. తమ మోసాన్ని బయట పెట్టేవారి యత్నాలను విఫలం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తారు. నిజానిజాలు నీలాంటి వారికి తెలియనీ కుండా వ్యతిరేక ప్రచారం చేస్తారు. పుకార్లు పుడ్తాయి. అపవాదులు, నిందలు వ్యక్తుల పై చెలరేగుతాయి.

ఈ నాడు శైశవ దశలోనున్న మీ సంఘాలను, ఏ మహాతల్లులో అష్టకష్టాలుపడి స్థాపించి, జీవం పోసారు. జాతికి జీవనమైన నీలాంటి విద్యావతులు, మీ జీవితాలను, మీ అభివృద్ధిని కోరే సంఘాలకై వినియోగించాలి. అపవాదులకు భయపడ కూడదు. మీ శ్రేయస్సు కోరే సమాజానికి అండగానిలచి, మీ కృషికి తోడ్పడేందుకు స్త్రీ పురుషులలో చైతన్యం కోసం, నడుము కట్టుకొని ముందుకు నడవాలి.

★

మాతృశిక్ష

శ్రీ ఆయపిళ్ల రామారావు

"ధర్మభూమియనుచు త్యాగసీమయటంచు
వాసిగన్నయట్టి భరతభూమి
రాగభోగములకు రంగమైపోయెను
త్యాగమునకు నేడు తావులేదు...."

అందుకు మాతృశిక్షలోని భేదం ఒక ముఖ్యకారణమని వూహించి ఆంధ్ర మహిళ అభివృద్ధి పొందాలని ఆశతో "ఆంధ్ర మహిళ"కు దీనిని అంకితం చేస్తున్నా.

ఈనాటికను ప్రదర్శించాలన్నా, ముద్రించాలన్నా రచయిత అంగీకారాన్ని వ్రాతమూలకంగా పొందాలి.

——రచయిత.

1

[శివనేరి దుర్గంలోని గది. పూర్వకాలపు కుర్చీలు రెండు ఓప్రక్కనూ-మరోప్రక్క జిజియా బాయి శివాజీని ఊయల్లో వుంచి ఊపుతూంటుంది. గోడలపైని వీరపురుషుల ఫోటోలు, ఊయలమీదను శివాజీ ఆడుకొనుటకు ఒక గుర్రపుబొమ్మ, ఓ చిన్న ఖడ్గం వ్రేలాడుతూ వుంటాయి.]

జిజియా బాయి:—(లాలిపాట)

బజ్జోర నాతండ్రి బజ్జోరనీవూ
ఒజ్జలంతానిన్ను బుజ్జగించంగా ||హాయీ||
కలలోని గడ్డాలరాక్షసుల జూచి
కాపింతయైనను కలత జెందకుమా ||హాయీ||
రాముండు రాక్షసుల వేటాడినట్లూ
రాష్ట్రపతివై నీవు రంజిల్లవయ్యా ||హాయీ||

(శివాజీ ఒక్కసారి ఏడ్చి ఊరుకుంటాడు)

జిజియా:—అదిగో, ఏడుస్తున్నావా? ఆఁ!

దుఃఖమేనీయకెను దుర్బలత జూపూ
దుఃఖమును మాని యిక సుఖనిద్ర కొండూ ||హాయీ||

(శివాజీ నిద్రిస్తూవుండగా దాసి జిజియాబాయి వెళుతూంటేగా తెర.)

2

(అప్టు యింట్లో గది-మధ్యరకంగా అలంకరించబడి వుంటుంది-ఊయల్లో అబ్బాయి సగం కప్పబడి-ఊయలకుపైన అబ్బాయి ఆడుకోటానికి 'కీ' యిచ్చిన 'డాన్సింగ్ గర్ల్' గిరగిర తిరుగుతూవుంటుంది.)

రాంబాయి:—(ఊయల ఊపుతూ) పడుకో, అమ్మా, పడుకో, అదిగో! పిల్లి!

(పాట)

పిల్లిరావే నీవు పిల్లలకు తల్లీ
మా పిల్లనేమనకూ ఎల్లవేళలనూ
అల్లవాళ్లింటిలో మెల్లగాదూరీ
పాలు పెరుగూ త్రాగి మరి పారిపోవే.

(అబ్బాయి ఏడ్చి వూరుకుంటాడు.)

రాంబాయి :—

ఏడవకూ నాబాబూ ఏడవకూనీవూ
ఏడిస్తే నీకళ్లూ నీరుగారేనూ
నీళ్లైనకారితే నేజూడలేనూ
నిద్రపోనాతండ్రీ నిద్రపోనీవూ

(మళ్లీ అబ్బాయి ఏడ్చి ఊరుకుంటాడు.)

రాంబాయి :—అదిగో! అదిగో! బూచి! అమ్మోయి బూచికరిచేస్తుందమ్మా! పడుకో, పడుకో! కళ్లు మూసుకో! కళ్లిప్పితే కరిచేస్తుంది.

(అబ్బాయి నిద్ర-టేబిలుపైనున్న పాలబుడ్డీని అబ్బాయి ప్రక్కనపెట్టి, రాంబాయి వెళుతూవుండగా తెర).

3

(శివనేరిదుర్గం-శివాజీని ముస్తాబుచేస్తూ జిజియాబాయి.)

జిజియా :—బాబా! భవానికృపవల్ల ఆ దుర్మార్గుల బారి నుండి తప్పుకున్నాం. చూచావా, ఆ మూర్ఖులు ఎంత దయమాలి హిందువుల్ని హింసిస్తున్నారో. వాళ్ల బాధల్నుండి ఎప్పుడు భారతీయులు విముక్తులౌతార్రో! అల్లాంటి పాపుల్నందర్నీ హతమార్చటానికెవరో వీర పురుషుడవతరిస్తాడని మా గురుదేవు శలవిచ్చారు. ఆ భాగ్యం ఎప్పుడు పడుతుందిరా?!

శివాజీ :—(ఒరపైని చేయివేసి) అమ్మా! వాళ్లందర్నీ ఒక్క చిటుకలో చంపేసిరానా!...రాత్రి చెప్పేవు కదమ్మా—శ్రీకృష్ణుడువృషభాసురుడ్ని ఎలాచంపేడో! పంపవమ్మా నన్ను.

జిజియాబాయి :—(శివాజీ బుగ్గను ముద్దుపెట్టుకుని) అంత మంది జనాన్ని నువ్వొక్కడవే జయించలేవోయ్. పెద్ద వాడవయ్యాక కొంతమందిని సహాయం తీసుకొని వెళ్లి చంపుదువుగాన్లే (మళ్లీ శివాజీ బుగ్గపై ముద్దుపెట్టుకుంటుంది.)

మరాఠా సిపాయి :—(ఒక పెద్ద సింహపు బొమ్మతో ప్రవేశించి) మహారాజుగారు విజాపురంనుండి పంపినారండి (వినయంగా నమస్కరించి వెళతాడు.)

శివాజీ :—ఏమిటమ్మా అది!?

జిజియాబాయి :—సింహం!

శివాజీ :—(పరుగెత్తి బాణాన్ని తెచ్చి) నీవు తప్పుకో అమ్మా (బాణాన్ని ఎక్కుపెట్టి గురిచూస్తాడు.)

జిజియాబాయి :—(అంతవరకు ఊరుకొని) ఆగవోయ్. అది నిజమైన సింహంకాదు. బొమ్మ! నువ్వు పెద్దవాడవయ్యాక అడవిలోకెళ్లి చంపుదువుగాన్లే. నాన్నగారు మనల్ని పూనామండలానికి పంపించేస్తారట. అక్కడ అడవుల్లోని క్రూరజంతువులు ప్రజల్ని చాల బాధపెడుతున్నాయట!

శివాజీ :—(బాణాల్ని యధాస్థలంలో వుంచి) అమ్మా, దాదా ఇవాళ వేగం రమ్మన్నారు మంచిపాఠం చెప్తారట.

జిజియాబాయి :—(వెళ్లిరా నాయనా.)

(శివాజి వెళుతూవుండగా తెర.)

4

(రాంబాయి జడవేసుకుంటూండగా అబ్బాయి ప్రవేశం ఏడుస్తూ.)

రాంబాయి :—అదిగో! వీధిలోకి వెళ్లొద్దురా అంటే వెళ్లా? ఏం? ఏమయిందీ?!

అబ్బాయి:—(ఏడుస్తూ) అల్లవాళ్లమ్మాయి...అంటే... నన్ను...హుఁ వెక్కిరిస్తూందే.

రాంబాయి :—నువ్వూ వెక్కిరించ లేకపోయా?

అబ్బాయి :—వెక్కిరిత్తే-మరొచ్చి-కొట్టిందేనన్ను.

రాంబాయి :—కొట్టిందీ...ఎందుక్కొడుతుందీ?-నువ్వేదో దాన్ని కొడితే అదీ కొట్టివుంటుంది.

అబ్బాయి :—ఉత్తినే కొట్టిందే.

రాంబాయి :—చఫ్...నిజం చెప్పు...

అబ్బాయి :—వాళ్లమ్మకూడా నన్ను తిట్టిందే.

రాంబాయి :—ఆఁ! లక్ష్మీబాయికి మహాపొగరుగా వుంది. తనపిల్లను వెనకేసుకొచ్చి నిన్ను తిడుతుందేం! ...ఉండుదాన్ని చెప్తాను...ఊరుకో...నాన్నగారొచ్చింతరవాత చెబతాం...(అబ్బాయిని ఎత్తుకుని) మరి వీధులో కెళ్లకమ్మా, అక్కడ గాడ్దాల బూచులుంటాయీ.

అబ్బాయి :—(తల్లి మెడ గట్టిగా పట్టుకుని) వెళ్లనే, అమ్మా, వెళ్లను.

రాంబాయి :—కాస్త కాఫీ చేసియిస్తావుండు (అబ్బాయిని దింపి వెళుతుంది.)

(పిల్లి పిల్ల గెంతుతూ వస్తుంది.)

అబ్బాయి :—అమ్మోయ్ ... ఓ... ఓ ... (ఏడుస్తూ తల్లి వున్న వేపుకు పరుగెత్తుతూ ఉండగా తెర.)

5

(పూనా పరిసరప్రాంతం-ఉద్యానవనప్రదేశం-దాదోజీ కొండదేవు, శివాజీ, ఖడ్గాలు క్రాసుగా (×) పట్టుకొని వుండగా)

దాదోజీ :—(కొద్దిసేపు ఖడ్గాన్ని అల్లా పట్టివుంచి ఒక్కసారిగా లాగి శివాజీని కౌగలించుకొని) అసహాయశూరుడవయ్యావునాయనా.

శివాజీ :—(కౌగలి విడిపించుకొని నమస్కరించి) గురుదేవునిదయ.

దాదోజీ :—బాబా! ఏదీ, ఆ బాణాల్నందుకో.

శివాజి :—(బాణాల్ని తెచ్చి సరిగా పట్టుకొని) ఆజ్ఞ.

దాదోజీ :—(వ్రేలుతో చూపుతూ) చూడు! ఆ వంక మామిడి దక్షిణపుశాఖ మధ్యను ఒక ఎండుపుల్ల...... కనపడిందా!...ఒక్క బాణంతో త్రుంచాలి.

శివాజి :—(బాణాన్నెక్కుపెట్టి గురిచూసి విసుస్తాడు.)

దాదోజీ :—శహబాష్! గురువును మించిన శిష్యుడు (బుజమును రాస్తూ నేను మావళా జమాబందీ చేయబోతున్నాను. నేవచ్చేలోగా నీతిశాస్త్రంలో నీకు చెప్పినంతవరకు మననం చేస్తూవుండు. సందేహాలేవైనావస్తే మాతాజీనడుగు (వెళ్తాడు.)

(నేతాజీ, తానాజీ, సూర్యాజీవచ్చి వంగి నమస్కరిస్తారు.)

శివాజి :—(నేతాజీ భుజముపై చేయివేసి) సమయానికే వచ్చారు. మీరంతా కుశలమేఁనా!

తానాజీ :—తమ కటాక్షం (వినయంగా).

శివాజీ :—నేతాజీ! ఆరోజున తురకలనుండి గ్రహించిన ఆవులమందను మనమావళీపల్లెలోని పసిపిల్లలున్న ఇండ్లకు ఒక్కొక్కటిగా పంచారా!

నేతాజీ :—ప్రభువుల ఆజ్ఞకు వ్యతిరేకం జరుగుతుందా!

శివాజీ !—సరే! ఈరోజున మనం చేయవలసినదాన్ని గురించి ఆలోచిద్దాం నడవండి. మిత్రుడు గఫర్ ఖాను కూడ మనకోసం ఎదురుచూస్తూంటాడు.

సూర్యాజి :—ఈ తురకలంతా గఫర్ ఖానులాంటి వాళ్లే అయితే దేశం ఎంత సుభిక్షంగా వుండేది!

శివాజీ :—మీ సహాయంవల్ల, మాతృదేవి ప్రోత్సాహంవల్ల, నేను భారతదేశాన్ని సుభిక్షంగా చేయగలనన్న నమ్మకం నాకువుంది. అటుపైని భవానిమాతదయ...నడవండి. (ముందు శివాజీతో అందరూ వెళుతూండగా తెర.)

6

(ఊరవతుల-అబ్బాయి-అతని స్నేహితులు-గోపాలం, సుందరం, సూర్యం కూర్చొని-ప్రక్కన పేకముక్కలుంటాయి.)

అబ్బాయి :—ఈ యేడాదికూడా పరీక్షపోతే చదువుబాధ తప్పిపోతుంది.

సూర్యం :—స్కూల్ ఫైనల్ ఆనర్స్ అయింతర్వాత చదువెందుకు భాయి—.

సుందరం :—ఉద్యోగాలుమాత్రం దొరుకుతా యేఁవిటి.

గోపాలం :—రిజల్ట్సు పదిరోజుల్లో వస్తాయి. అంగాకా మన్నడిగీ వాడెవడూలేడు.

అబ్బాయి :—ఆ తర్వాతమాత్రం ఎవళ్లేమంటారు! జయాప జయాలు దైవాధీనాలు.

గోపాలం :—మా అమ్మ చెప్తూంటే వ్రేస్తుంది మీ అమ్మలా కాదు.

సూర్యం :—మనకంటే ఆడపిల్లలు బాగా గుర్తుపెట్టుకుంటు న్నారు.

గోపాలం :—వాళ్లు క్లాసులోవుండగా చదువుమీద ధ్యానం వెళుతుందా భాయి.

సుందరం :—నిజంచెప్పేవు....ఆవరుళని మాణిసేవా...... గోడమీద గకంగా తయార్వైతే, మెరుపులాగ చూపులు విసి రేస్తూ అందర్నీ అల్లరపెడుతుంది. దానివైపు చూడ్డం తోటే సరిపోతుంది. ఇంక చదువెక్కడ.

అబ్బాయి :—మాట్లాడదామంటే కొరకొర చూసేది.

గోపాలం :—కొంత బుజం బుజం కలపాలని ప్రయత్నించే వన్నమాట!

అబ్బాయి :—మేం చిన్నప్పుడు ఆడుకోనేవాళ్లం...కాని దానికిప్పు నె త్తికొచ్చేయి.

సూర్యం :—మీ యింటిపొరుగేకదూ వాళ్లు ?!

సుందరం :—అందుకేమనవాడింటికి మనం రోజూ వస్తే వాళ్లం.

అబ్బాయి :—పిన్నాను వాళ్లింటికెళ్లి ఇంగ్లీషు నోట్సు గ్నంటే "అందులో ఆడబొమ్మలుండవు" అని చెప్పిందిసుమీ!

సుందరం :—బ్రేవో...

(అందరూ నవ్వుతారు.)

(అబ్బాయి జేబులోంచి బీడీలుతీసి పంచాక అందరూ నిలబడి, అగ్గిపుల్ల వెలిగిస్తూండగా తెర.)

7

(అరణ్యప్రదేశము-శివాజీ ప్రవేశము)

(ఖడ్గం చేతిలో)

శివాజీ :—ఎవరది? నేతాజీ!? మీరంతా ఎక్కడ?

(నేతాజీ, తానాజీ, సూర్యాజీ, ప్రవేశం)

నేతాజీ :—ప్రభూ! ఆజ్ఞ.

శివాజీ :—మాతాజీని, నన్ను చిన్నతనంలో బైజాపుర దుర్గంలో వుండగా అవమానించ ప్రయత్నించిన ఆలీ ఖానును యీరోజున హతమార్చాం. ఈ సంగతి మాతా జీకి నివేదింపవలసివుంది. నేనిప్పుడే బయలుదేరి వారి సందర్శనానికి వెళుతున్నా.....మూర్ఖుడైన మన బాజీ రావు ఎదిరిపక్షాన్నవుండి మనల్ని నాశనం చేయాలనుకుని తనే మోసగింపబడ్డాడు.

తానాజీ :—శివాజీ మహారాజ్‌తో వైరం పెట్టుకోవడం శిక్షనుకొని తెచ్చుకోవటమే.

శివాజీ :—మనవారి చేతుల్లోపడిన ముల్లానా సుబేదారుని కోడల్ని సురక్షితంగా ఆమెయింటికి చేర్పించారా?

నేతాజీ :— వెంటనే.

శివాజీ :—భవానిమాత దయపొందాలంటే పరస్త్రీలను తల్లులుగా భావించాలి. అది మాతృదేవత సందేశం. పవిత్ర హిందూ ధర్మానికి ఏమాత్రం భంగం కలిగించ రాదని మనవారందరికి కఠినమైన ఉత్తరువు ఇవ్వండి.

తానాజీ :—శిరసావహిస్తున్నాం.

శివాజీ :—మన ఆధీనంలోకివచ్చిన కల్యాణ ప్రాంతంలో బందోబస్తుకి తగిన యేర్పాట్లు చెయ్యాల్సుంది. దుర్గం లోకి నడవండి ఆలోచిస్తాం. (నడుస్తూ) జై భవాని మాతకు జై!

అందరు :—'జై'

శివాజీ :—'జై' మాతృదేవికి 'జై'

అందరు :—'జై'

శివాజీ :—'జై' హింద్‌మాతకు 'జై'

అందరు :—'జై' హింద్.

8

(రోడ్డుమీద-అబ్బాయి ఓ ప్రక్కనుంచి-గోపాలం, సుంద రం, సూర్యం, ఓప్రక్కనుంచి-వచ్చి కలుస్తారు.)

సుందరం :—ఇదుగోరా మన గొరగారు! ఏం బా.

గోపాలం :—ఏం భాయ్, యీమధ్య ఏమ్యం అయిపోయావ్ ! ? ఎక్కడో మాటు వేసినట్లుందే మొహం !

అబ్బాయి :—(నవ్వుతూ) లేదురా, యీ మధ్యల్లా ఉద్యోగప్రయత్నంలో 'ఛైర్‌మన్' వెనకాల తిరగటంతో సరిపోయింది.

సూర్యం :—ఏమయిందాఖరుకు ? !

అబ్బాయి :—ఎల్లాగో సక్సీడయ్యాననుకో.

సుందరం :—ఓరినీ ! ... చెప్పవేంరా ? ... ఎక్కడా ? ! ఏమిటీ ! ?

అబ్బాయి :—పద్ధాలుగో వార్డుకి 'బిల్ కలక్టరు'గా.

గోపాలం :—మరేం ! కో వెలపిధి అందులోదే. కొట్టేస్తే ఛాన్స్.

సూర్యం :—ఎల్లాగయితే యేం 'కలక్టర్' అనిపించుకున్నావ్‌రా బాయ్... (అందరితో తొందరగా) ఆఁ నడవండి, ఇవాళ అబ్బాయి గాడి 'టీ పార్టీ' 'మోడరన్ కేఫ్'లో.

అబ్బాయి :—ఉండరా, ఇంత సడన్‌గానే,

సుందరం :—ఉండూలేదు గుండూలేదు, నడూముందు, డబ్బులేకపోతే 'కలక్షన్' లోది పెట్టు.

అబ్బాయి :—(జేబులో 'సిగరెట్స్' తీసి అందరికీ అందించి) అయితే కానీండి.

(అందరూ 'సిగరెట్సు' నోళ్లకు తగిలిస్తారు. అబ్బాయి జేబులోంచి అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగిస్తూండగా తెర.)

(తెరలో మంగళం.)

★



శ్రీమతి దొప్పలపూడి అనసూయగారి చిరంజీవి.
"దీర్ఘాయుష్మాన్ భవ"
—ఆంధ్రమహిళ

ఆపాలబుగ్గల్లో తీపివెన్నెలగాయ
చూపుచూపునతొంగి చూడమా అనసూయ
గాంధిటోపీ పెట్టి కర్మవీరుడిలాగు
అల్లుడా యెందాక వెళ్లివస్తావోయి ?

★

ఏ తాత పిలిచాడు ఏ తల్లి పొమ్మంది ?
ఏ రాష్ట్రవిజయశం ఖారవమునమ్మంది ?
నేతిలో జాతీయకే తనము ధరియించి
స్వాతంత్ర్య యాత్రకా సాగిపోతున్నావు !!

★

బొటునిండా మల్లె సూటిగానదవాలి
కోటునూటూవేసి బూటుమూనేశావు
బావుందిరా !! బుల్లిబాబు ! నీ ముస్తాబు
భావిభారతభాగ్య పట్టభద్రుడివిరా !!!

—కరుణశ్రీ మామయ్య

★

వ్యథల నెరుగని మధురదశ

శ్రీమతి దొప్పలపూడి అనసూయగారు

"బాల్యము సర్వేశ్వర తేజోవిలసితము. ప్రకృతి యొక్క విశుద్ధత, వినిర్మలత, మృదులత, సుందర బాల్యమందే విస్ఫురితములు కాగలవు."

మానవ జీవితకాలంలో బాల్య యౌవన కౌమార వృద్ధాప్యములను నాల్గు దశలను ఇష్టమున్ననూ లేకున్ననూ అనుభవించక తప్పదు.

యీషణత్రయముల తాపాగ్ని సోకని బాల్య దశ మాత్రమే యెల్లరకూ ఆనంద ప్రదమైనది. ఏ చింతలూ లేక ఆట పాటలతో ఒట్టి అమాయిక భావాలతో హాయిగా గడుపుటకు బాల్య దశయే ముఖ్యమైనది. యిందుకు నిదర్శనంగా మనము చూడగల్గుచున్న దేమిటంటె వివిధ భావములు గల మానవుల వదనములు వివిధ విధములుగానే వుంటాయి. పసితనంలో మాత్రము బిడ్డలెల్లరి వదనశ్రీలు ఒకే విధంగా నిర్మల నిష్కాపట్యాన్ని ప్రకటిస్తూ ముద్దొస్తుంటాయి. పెద్ద వారగుచున్న కొలది క్రమంగా కామ క్రోధాది అరిషడ్వర్గాలు వ్యాపించి తమ పైశాచిక బలంతో హృదయాన్ని వశపర్చుకొని ప్రశాంత సుఖప్రదాలైన దైవగుణాలను నశింప జేయుటానికి తీవ్రంగా ప్రయత్నిస్తుంటాయి.

కొందరు మాత్రము బాల్యము గడచిన తరువాత కూడ సంసార బంధములలో సంపూర్తిగ లగ్నము కాకుండ తాపత్రయముల కాక సోకిన వెంటనే అనుభవమగు అశాంతికి పట్టుకోలేక వాని నణచి వేయుటకు ప్రయత్నింతురు. మొత్తములో అట్లు ప్రయత్నించువారి సంఖ్యయే తక్కువ, ప్రయత్నించిన వారిలో కృతార్థులగు వారి సంఖ్య మరీ తక్కువ. కృతార్థులైన, ధన్య జీవుల వదనశ్రీలు ప్రేమచిందుచూ ఆకర్షణీయముగా వుంటాయి. వారు జలరాశి యందే పుట్టి పెరిగిననూ జలంబు లంటని జలజపత్రముల రీతిగా సంసారమందుండియూ అశాంతి ప్రదములగు అసురగుణముల నంటనీయక దైవగుణముల వృద్ధి జేసుకొని బాల్యములో వలెనే ప్రశాంత సుఖాన్ని బడయ గల్గుదురు.

యెల్లరకూ అట్టి సుఖస్థితి సులభముగ లభ్యమగునది కాదు. బాల్యదశలో మాత్రమే ఎల్లరూ ననుభవించ నర్హులు.

బాల్యము బాధముల నెరుంగనిది, బంధములను తమధీశక్తితో తప్పించుకొని స్వేచ్ఛబొందిన వారు బాల్యదశలో వున్నవారి కంటె కృతార్థులు.

మనము మన జీవిత కాలాన్ని దుఃఖములతో అశాంతితో గడపుటకే జన్మించలేదు.

అల్పాయుష్కులయ్యునూ అంతులేని ఆశలను కల్పించుకొని తమ వాంఛాసిద్ధికై తోడి ప్రాణులను హింసించుచూ దుశ్చింతలతో శాంతి లేక దుంపిల్లు మానవ మర్కటములను గాంచి పరమాత్మ నవ్వుకొనును.

బాల్య దశలో వలెనే, యౌవన కౌమార వృద్ధాప్యములలో గూడ హృదయాన్ని అసుర గుణముల కాస్పదము కానివ్వక ప్రేమతో సానుభూతితో, క్షమతో, సంతృప్తితో, శాంతిగా, హాయిగా, ఆనందమయంగా, ప్రపంచ నాటక రంగమునందు మన జీవిత కాలాన్ని నటింపజేయుట కంటే సుఖప్రదమగు పథము ఆదర్శకమగు కర్తవ్యము యీ విశ్వంలో వేరొకటి లేదు.

★

బ్లాక్ మార్కెట్

(రేడియో వుపన్యాసము)

శ్రీమతి కె. రామసుబ్బమ్మగారు

బ్లాక్ మార్కెట్టనగా నేమి? అదెందుకు వచ్చినది? దీని నిర్మూలించు విధానము లెవ్వి? ఇందులో ప్రభుత్వ కర్తవ్యమెద్ది? ఈ ప్రశ్నలకు మనము జవాబులు తెలుసుకొన్న ఎడల, బ్లాక్ మార్కెట్టు కరతలామలకము కాగలదు. ఇప్పటి కాలములో, ఏ పదముకూడ ఇంతటి వ్యాప్తిలోను, వాడుకలోనూ లేదు. ఆబాలగోపాలము బ్లాక్ మార్కెట్టు బారిని పడిన వారేనూ. పెద్ద వ్యాపారము మొదలు, చిన్న వ్యాపారాలు, రైల్వే, సినిమా టికెట్ల వరకు బ్లాక్ మార్కెట్లేను. ఇంతయేల, ప్రపంచమంతయు, బ్లాక్ మార్కెట్టు మహిమ, అనుటలో అతిశయోక్తి యెంత మాత్రము ఉండదు. బ్లాక్ మార్కెట్టు అనగా చీకటి బజారు. అనగా అవసరమైన వస్తువులు, ప్రజానీకానికి అవసరమైనప్పుడు అవి కొనుటకు అంగడికి పోయిన యెడల అవి దొరకక పోవుట, దొరికినను, విపరీతమైన ధరలకు దొరకుట. ఇట్టి దురవస్థలలో ప్రజలుక్కిరి బిక్కిరి యగుచున్నారు. గత నవంబరులో ముగిసినటువంటిన్నీ, ౬ సంవత్సరములు ప్రజలను పీల్చి పిప్పి చేసినటువంటిన్నీ, కూటికి గుడ్డకు కూడ కరువు కలిగించినటువంటిన్ని యుద్ధమువల్ల, ఇట్టి విపరీతపరిస్థితు లేర్పడినవి. బ్లాక్ మార్కెట్టు బాధ మనకు ముఖ్యంగా, విదేశవస్తువుల పట్ల ఎక్కువైనది. కొన్ని విదేశ వస్తువులకు బానిసలమైన మనము, అనేక సంవత్సరములుగా సర్వసాధారణముగా, ఆ వస్తువులుపయోగించుటకు అలవాటుపడి యున్నాము. ఉదాహరణకు కొన్నింటిని చెప్పుచున్నాను. గుండు సూదులు, పౌడర్లు, క్రీములు, అతి సున్నితమైనటువంటి గుడ్డలు, ఫౌంటెను కలములు, రిష్టువాచీలు, ఇంగ్లీషు మందులు, డబ్బాపాలు మొదలగునవి. ఇంకనూ ఈ జాబితాను పొడిగించవచ్చునుగాని, అనవసరము. ప్రతి హిందూదేశస్థుడును, ఉదయము నిద్రలేచినది మొదలు రాత్రి పడుకొనువరకు, తాను తాకేటటువంటిన్ని, తినేటటువంటిన్ని, కట్టేటటువంటిన్ని, అలంకరించుకొనేటటువంటిన్ని, సవారి చేసేటటువంటిన్ని వస్తువులను చూచిన వీటిలో ఎన్ని విదేశ వస్తువులున్నవో గ్రహించుకొన్న యెడల, మన బానిసత్వము తేట తెల్లమగును. ఇట్టి దుర్దశ ఏ నాగరికతగల స్వతంత్ర దేశములో కూడ ఉండదు. విదేశ పరిశ్రమలవల్ల తయారు కావడము, హిందూదేశ ప్రజలకు విక్రయించడము, ఇది మన ప్రారబ్ధ ఖర్మము. పరప్రభుత్వమునకు, మన సౌభాగ్యముతో ఏమిపని? కావుననే అనేక పరిశ్రమలు మన దేశములో. స్థాపించకుండా జాగ్రత్తపడినారు. ముఖ్యముగా, ఇట్టి విదేశ వస్తువులపైన మనకు గల మక్కువయే బ్లాకు మార్కెట్టుకు చాలాభాగము కారణమైనది.

యుద్ధము మూలాన దేశములో ఉత్పత్తి చాలా తగ్గిపోయినది. ఉన్న ఉత్పత్తి అయినను ప్రజానీకానికి అందుబాటులో లేక అల్లాడడము, ఆ విపరీతపు పరిస్థితులలో, దేశము ఉన్నదంతా వూడ్చి యుద్ధమునకు పంపడమువల్ల ప్రజలు కూటికి, గుడ్డకు కఱువై సామాన్యమైన నిత్యజీవితానికి కూడా అవసరమైన వస్తుసముదాయము లభించక అవస్థల పాల్పడుచున్నారు. బ్లాక్ మార్కెట్టు ఇట్లు విరివిగా పెరుగుటకు, ప్రభుత్వ అశ్రద్ధకూడ కొంతవరకు కారణమని చెప్పవచ్చును. ప్రజలకు ప్రభుత్వమునకు అన్యోన్యమైన సంబంధము లేనందువలన లాభమే ప్రధాన లక్ష్యముగల, వ్యాపారస్థులు ఇదయే మంచి తరుణమని ఎంచి ఎన్నడూ విని ఎరుగని, విపరీత ధరలు పెంచి, ప్రజలను దోచుకొనిరి. గొంగ లాభాలకు బానిసలైన వ్యాపారస్తులు, ఉద్యోగస్తుల దృష్టి తమపై పడకుండా కొన్ని చోట్ల లంచములిచ్చియు, అధర్మములైన విరాళము లిచ్చియు, తప్పించుకొనుచుండిరి. ప్రజాప్రతినిధులందరు ప్రజలతో గలసి మంచి చెడ్డలు విచారించే అవకాశం లేనందువలన ప్రజలు తమ కష్టములను తెలియపరచుకొనుటకైనను వీలు లేక అనేక విధములైన ఆర్థిక దురవస్థలకు లోనుకావలసి వచ్చెను. ప్రభుత్వము సకాలములో, సక్రమమైన చర్య తీసికొని, అట్టి సంఘ నీతికి

విరుద్ధముగా వర్తించువారిని కఠినముగా శిక్షించి, ప్రజల కవసరమైన వస్తువులను విరివిగా ఉత్పత్తి చేయుటకు మార్గముల నన్వేషించి, ప్రభుత్వమున నే జాగ్రత్త వహించియుండిన ఇటువంటి క్లిష్ట పరిస్థితులుండి యుండవని నా విశ్వాసము.

బ్లాక్ మార్కెట్టు ప్రాబల్యమునకు కారణములు, రెండు ముఖ్యమైనవి. ఒకటి వస్తువు యొక్క అవశ్యకత లేని దాని యందు కొనువారికి గల భ్రాంతిగాని. రెండవ కారణము నీతి దూరుడైన వర్తకుని యందును, ఇట్టి దుష్కార్యములను చూచి సహించి యూరకొను ఉద్యోగస్థుడని పేరు పెట్టుకొన్న అవినీతి పరునియందును, సమముగా ఆవరించుకొని యున్న ధనాశ, అక్రమచింత, రాక్షసత్వములు. ఇట్టి వర్తకుడు లంచము ఇయ్యనిదే బ్లాకు మార్కెట్టును నడపలేడు. అట్టి లంచము తీసికొననిదే, ఉద్యోగస్థుడు బ్లాకు మార్కెట్టును సాగనియ్యడు. వీరిద్దఱు ద్రోహులకంటెను, పెద్ద దేశద్రోహి, పిరికిపంద ఎవరనగా, ఈ విధముగా బ్లాకు మార్కెట్టులో విపరీతధరలు పెట్టి వస్తువులను కొని, తానుకొన్న సంగతిని బయటపెట్టక, కుక్కిన పేనువలె, నోరుమూసుకొన్న గృహస్థు.

బ్లాకు మార్కెట్టులో విపరీత ధరలకు వస్తువులను చూచిన గృహస్థు ఏ మొగమోటము లేక, తక్షణము సర్కారుకు ఆ వర్తకుని అప్పగించి, వానికి తగిన శిక్ష వేయించవలయును. లంచమిచ్చిన వర్తకుడు ఉద్యోగస్థునిపైన సర్కారుకు ఫిర్యాదుచేసి, ఆ ఉద్యోగస్థుని కఠినముగా శిక్షింపజేసిన యెడల, బ్లాకు మార్కెట్టును అంతరింపజేయుటకు మార్గమేర్పడును.

అన్నిటి కంటెను ప్రజల కత్యావశ్యకమైనవి, ప్రాణావసరమైన వస్తువులు రెండు. అవి ఆహారము, వస్త్రము. ఈ రెంటికిని, గత ౬ సంవత్సరముల నుండి, మనము చాలా బాధపడినాము. పడుచున్నాము. అందుకు కారణములు పరిశీలించిన యెడల, యుద్ధ సైనికులకుగాను, అధికముగా, మనము ఆహారమును గుడ్డను, సరఫరా చేయవలసివచ్చినది. యుద్ధకాలములో పంటలను తగినంత పండించలేక పోయినాము. సర్కారువారు యుద్ధకాలపు ఆఖరు దినాలలో, పండించమని ప్రచారము జేసినారుగాని యెక్కువ పంటలను పండించడానికి తగిన సౌకర్యములు రైతులకు కల్గజేయలేక పోయినారు. దప్పిక కొన్నప్పుడు బావి త్రవ్వుట కారంభించిన ఎంత లాభమో, ఇది కూడ అంతే. గోరుచుట్టుపై రోకటిపోటున్నట్లు, గత సంవత్సరము మన దేశములో ముఖ్యముగా దక్షిణ హిందూదేశములో వర్షాభావముచే, పంటలు పాడైపోయినవి. దేశము క్షామ పరిస్థితులకు లోనైనది.

ఈ పరిస్థితులలో ఆహారమును గురించిన్ని, గుడ్డలను గురించిన్ని మనము కొన్ని పనులను చేసి జాగ్రత్త పడవలసి యున్నది. లేని యెడల, బెంగాలు క్షామములో కంటె, లక్షలకొలది ప్రజలు, మన దక్షిణ హిందూదేశములో తిండి లేక మరణించవలసివచ్చును. ఈ వస్తువుల ఉత్పత్తి వున్నదున్నట్లు ఏ మాత్రమును చాలదు. కాబట్టి, ఉన్నటువంటి, ఆహార పదార్థములను, గుడ్డలను, మన మందరము, పొదుపుగా వాడుకొని వీటిని దేశములోని ప్రజలందరికి అందుబాటులో వుండులాగున చూచుకొనవలయును.

కనుక మనము ఆహార పదార్థములు, వస్త్రములును కావలసినంత వుత్పత్తి చేయవలెను. బ్లాకు మార్కెట్టు వ్యాపారస్థులను ఎక్కడ దొరస్తే అక్కడ వప్పగించవలెను. లంచగొండితనమును నిర్దాక్షిణ్యముగా నిర్మూలింపవలయును. బ్లాకు మార్కెట్టు నిర్మూలనమునకు, ప్రజలు తగినంత సహకారమును, ప్రభుత్వమునకు చేయవలసియున్నది. మీలో విద్యావంతులగువారు ఏ ఏ సరుకునకు, ప్రభుత్వమే యే ధర నిర్ణయించినదో ప్రభుత్వము బ్లాకు మార్కెట్టు నిర్మూలించుటకై కావించిన ఉత్తర్వులు, మొదలగు సంగతులు, ప్రజలలో బాగుగా ప్రచారము చేసి, ప్రజల సహకారము లేనిది, ఇటువంటి, సంఘ నీతికి విరుద్ధములగు పనులు రూపుమాపుటకు వీలు లేదని, గట్టిగా నొక్కి చెప్పవలయును. ప్రభుత్వము కూడా, ఇట్లు బ్లాకు మార్కెట్టులో అమ్ము వర్తకుని బ్లాకు మార్కెట్టును ప్రోత్సహించు వారిని కారాగృహవాస శిక్షకు పాత్రులగునట్లు శాసించవలయును.

★

★ లేడీస్ క్లబ్ ★

* శ్రీమతి మల్లవరపు విజయలక్ష్మిగారు *

"ఏం, రాధా! ఇవ్వాళ క్లబ్బుకు పోలేదా! రోజూ రాత్రి యెనిమిదింటికి యింటికి వచ్చే వాడిని కనుక నాకు యేమీ తెలిసేది కాదు. నీవు రోజూ క్లబ్బుకు పోతున్నావనే అనుకుంటున్నా! ఏం! ఎందుకు పోలేదూ? నీకు వంట్లో బాగా లేదా? అబ్బాయేడీ?" అని యేకధాటీగా ముకుందరావుగారు యింటికి రాగానే భార్యమీద ప్రశ్నలు కురిపించారు.

"ఏం? మీరు యివ్వాళ అయిదింటికే ఆఫీసునుంచి వచ్చేశారేం?" అని అడిగి, జవాబు కెదురు చూడకుండానే, 'అబ్బాయిని పక్కయింటివారి అమ్మాయి యెత్తుకు తీసికెళ్ళింది. వాళ్ళకి వాడంటే యెంతో ముద్దు సుమా! అమ్మాయిని పనిపిల్ల అట్లా తోపుడు బండీలో తీసికెళ్ళింది" అంది రాధ.

"ఇవ్వాళ మా ఆఫీసు నాలుగింటికే అయిపోయింది. ఆగకుండా యింటికే వచ్చేశాను. వెధవాఫీసు యెక్కడో దూరంగా జార్జిటౌనులో వుందాయెను. మామూలుగా అయిదున్నరకు ఆఫీసు అయిపోయినా గాని, ఏవో కొంత సేపు నలుగురం కలిసి బాతాఖాని కొడతాం. అటు తర్వాత ట్రాంస్టాండుకు వచ్చి, అక్కడ పడిగాపులు పడుండి పడుండి కాళ్ళు పీక్కొస్తాయి. రాధా నీకు అనుభవంలేదు గానీ, యీ రోజుల్లో సాయంత్రమూ పొద్దున్నా ట్రామూ బస్సూ దొరకడం యెంత కష్టమో నీకు తెలుసా! అందుకే ఆఫీసు వదలి రోజూ ఆరింటికి బయలు దేరితే యిల్లుచేరుకునే సరికి యెనిమిది అవుతోంది. దానికేంగాని నువ్వు క్లబ్బుకి యివ్వాళ వక్కరోజే వెళ్ళలేదా, లేక రోజూ వెళ్ళడం లేదా? నీవు యింతా చేరి పదిహేను రోజులేగా అయింది" అంటూ సమాధానానికి ఆగకుండానే, "మన యిద్దరం పిల్లలను తీసుకొని యెక్కడికేనా వెడదామా? పని రోజుల్లో యెక్కడికి వెళ్ళేందుకే అవకాశం వుండదూ! పోనీ యివ్వాళ సినిమాకు దేనికైనా పోదామా! ఏమిటి?"

"ఎల్లుండి "స్వర్గసీమ" రిలీజట. చూసిన వాళ్ళు చాలా బాగుందని చెప్పేరు. ఇవ్వాళ బీచికి వెడదాము లెండి."

శాంథోమ బీచిలో రాధాముకుందులు పిల్లలతో సరదాగా కబుర్లు చెప్పుకుంటుండగా రాధ అంది కదా "ఎందుకండీ క్లబ్బు కెళ్ళడం? నా కోసం ఖర్చుపెట్టే డబ్బు దండుగ తప్ప, మరేమీ ప్రయోజన మున్నట్టు కనపడదు. ఇవ్వాళేయేం! అప్పుడే వారం రోజులనుంచీ మానేశాను. నాలాంటి వారికి అల్లాటి అర్హతవుండదని నాకు యిప్పుడే కాదు, యిదివరకునుంచే తెలుసు. మీరు సరదా పడుతున్నారు కదా! అని చేరాను. క్లబ్బులో చేరి నలుగురిలాగా మసిలేందుకు నాకేమి క్వాలిఫికేషన్లు వున్నాయి? నగలా? అసలు లేవు! పోనీ పట్టు చీరలా? అంతకంటే లేవు! పోనీ! భర్తా పెద్ద ఉద్యోగంలో లేరు. మరి దేన్ని బట్టి నన్ను గౌరవిస్తారూ" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుని, "పోనిద్దురూ! ఏదో మీరన్ని సార్లు నొక్కినొక్కి అడిగారని చెప్పేను గాని, లేకపోతే ఆ విషయం యెత్తేందుకే నా కిష్టం లేదు" అంది.

పాపం, ముకుందరావు అంతావిని నిస్పృహతో ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు.

ముకుందరావు ఉత్తమ కుటుంబానికి చెందినవాడు. ఆ కుటుంబంలో అందరూ మొగ ఆడా భేదము లేకుండా దేశం కోసం పాటుపడి జైళ్ళకు వెళ్ళివచ్చిన వాళ్ళే! ఉన్న ఆస్తిపాస్తులు కరిగి పోయాయి. కరిగి పోవా? ఆర్జన అనేది లేకుండా దేశం కోసం ఖర్చుపెడితే? ఇతను కూడా రెండు మూడు సార్లు జైలుకు వెళ్ళి వచ్చినవాడే మూమెంటు రోజుల్లో. ఆ రోజుల్లో కష్టసుఖాలు యేమీ తెలిసేవి కావు. మంచి విద్యావంతుడు. మనస్ఫూర్తిగా రాధను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి స్కూలుఫైనల్ పరీక్ష ప్యాసయింది. ముకుందరావు ఉన్నత ఆశయాలు కలవాడు కనుక భార్య స్వేచ్ఛకు యేమాత్రం అడ్డువచ్చే వాడు కాదు.

పెళ్ళయిన వెంటనే రాధ కడుపు ఫలించి యిద్దరు పిల్లలు పుట్టారు. ముకుందరావు యెంత స్వతంత్ర జీవైనా, పరిస్థితులు యెదురు తిరిగి నప్పుడు ఎవరేమి చేయగలరు? మన దేశంలో, ఆత్మ గౌరవానికీ, స్వతంత్ర జీవితానికీ, తావుంది కనక నా! అట్టి వుద్దేశాలు వున్నవాడు మలమలా మాడి చావాలిసిందే! బాగుపడాలంటే ఉచ్ఛ స్థితిలో నున్న నలుగురి దగ్గరికీ వెళ్ళి, చేతులు నలిపి ప్రాధేయపడి మంచి చేసుకోవాలి. అప్పటికీ వాళ్ల కటాక్షం కలుగుతుందని చెప్ప లేము. అసలు ఆపై వుద్యోగస్తులుకూడా ఒకానొకప్పుడు వాళ్ల పైవాళ్ల కాళ్ళట్టుకుని చచ్చి శాయింగల విన్నపాలు చేసి, ఆత్మ గౌరవం అమ్ముకుని సంపాదించుకున్న వుద్యోగాలవి. అల్లాంటి వాళ్లు తమ కష్టాన్ని మరిచి పోతారా! తాము తమ కంటే తక్కువవాళ్ల చేత అంత కంటే యెక్కువగా కాళ్లు పట్టించుకోవాలి. లేక పోతే తమ గొప్పతనానికి భంగం రాదూ! మరి!

ఇన్ని నాళ్లు జీవితం ఏకపధాన ఇంకొకళ్లకి లొంగకుండా గడిచింది. కాని వివాహమై పిల్లలు కలిగాక ఆ విధంగా స్వతంత్ర జీవయాత్ర చేసేందుకు వీలుందా? మన బానిస దేశంలో? స్నేహితుల సలహామీద ముకుందరావు ఆట్టే తన స్వతంత్ర జీవితానికి అడ్డురానటువంటి ఉద్యోగంలో నెలకు డెబ్భైరూపాయల వేతనం మీద మద్రాసులో చేరాడు.

తాను కుటుంబ పోషణానికి పగలు పది గంటలకు యిన్ని మెతుకులు తిని బయలుదేరి పోతే రాత్రి యెనిమిది గంటలకాయె యింటికొచ్చేది. ఈ లోపుగా, పాపం రాధ ఒకర్తీ యింట్లో ఏం తోస్తుంది? అందులో మనవేపైతే యిళ్లుకొంచెం పెద్దవిగా పెరడూ గట్రా వుంటాయెరి ఇక్కడేముంది! ఒక రొస్తే లోపలికి ఇద్దరు అవతలికి నడవాలి. ఆ రెండు గదుల్లో ఎంత సేపని కాలక్షేపం చేస్తుంది. అందులో చాలా చురుకైన పిల్ల. ఇంటి పని పిల్లలపని ఇట్టే సమర్థించుకుంటుంది. భర్తలాగే తనకీ కూడా ఉన్నతమైన ఉద్దేశాలున్నాయి. అస్తమానం వంటింట్లోనే పడి చావాలనే రకం కాదు. చిన్నప్పుడు తాను స్కూల్లో చదువుకునే రోజుల్లో బాట్‌మింటన్, టెన్నిస్ బాగా ఆడేది. ఆ స్కూల్లో ప్రయిజులన్నీ తనవే. ఒక సంవత్సరం ఆలిండియా వుమన్సు టోర్నమెంట్సులో, టెన్నిసులోనూ, బాట్‌మింటన్‌లోనూ, సింగుల్సులోనూ, డబుల్సులోనూ, కూడా ప్రథమరాలుగా వచ్చి ఎన్నో వెండి కప్పులు బహుమతి పొందింది. అంచేత కాకినాడలో ఆ అమ్మాయి పేరు చెప్పితే "ఓహో ఆ అమ్మాయా! టెన్నీసు ప్లేయరు కదూ!" అంటారు. అంచేత ముకుందరావు పూరకే తోచకుండా ఇంట్లో కూర్చో బెట్టడ మెందుకని, మదరాసులో లేడీస్ క్లబ్బులో చేర్పించాడు. మొదటి నాలుగు రోజులు బాగానే గడిచి పోయినై. పెందరాళే పనంతా పూర్తి చేసుకు, పిల్లలను తీసుకొని సరదాగా క్లబ్బుకెళ్లేది. టెన్నిసు కోర్టులో రాధతో సమంగా ఆ క్లబ్బులో ఒక్కర్తేనా ఆడ లేక పోయేవారు. ఇంక అయిదో రోజు నుంచీ ఆమెతో కబుర్లు మొదలెట్టేరు. ఆ క్లబ్బు (అధ్యక్షురాలు) ప్రసిడెంటు ధనికుల కుటుంబీకురాలు. వంటిమీద నగలు మోయలేనన్ని వున్నాయి. తిన్నగా నాలుగు ముక్కలైనా మాట్లాడలేదు. రెండువందల రూపాయలకు తక్కువ చీర యెప్పుడూ కట్టదు. ఇంక పోతే సెక్రటరీ ఒక పెద్ద సర్కారు ఉద్యోగస్తు భార్య. తిన్నగా ఓ అంటే న రాదు. ఎందుకూపొందని నవలలు మాత్రం అచ్చయినంతవరకు తెప్పించి యింట్లో పెట్టుకుంది. ఆ క్లబ్బులో మిగిలిన మెంబర్లకి చదవమనీ, అంత గొప్ప పుస్తకాలు యెక్కడా లేవనీ రికమెండు చేస్తూవుంటుంది.

"ఏమమ్మా! మీ ఆయన కేం పనీ?!! ఎక్కడ వుంటున్నారూ? జీతమెంత" అంది ఒకావిడ.

"టౌనులో ఏదో ఆఫీసులో (మరచి పోయానండి ఆ ఆఫీసు పేరు) గుమాస్తాగా వున్నారు. డెబ్భై రూపాయలండీ" అని రాధ అమాయకంగా చెప్పింది.

"మీ యింటికి అద్దెంతండీ? ఎన్ని గదులున్నాయి? మేడమీదా, కిందా!" అని ఇంకొకామె ప్రశ్న వేసింది.

"ప్రస్తుతం పన్నెండు రూపాయలిస్తున్నామండి రెండు గదులున్నాయి. కింద భాగమే. లైటుమట్టుకు లేదు."

"డెబ్భై రూపాయలు తెచ్చుకుంటూ అంతకంటే ఎక్కువేమి పెట్టగలవు లేయింటికి! అదేమిటమ్మా, పన్నెండు

రూపాయలకు యీ ఫ్రాక్లో యిల్లుందా! పైగా లైట్లూ, మేడాకూడానేం? ఇందుకే, ఆశ కంతులేదంటారమ్మాయ్." అంది మరొకావిడె, బుగ్గమీద వేలేసుకుని.

"పాపం! అందుకే మెళ్లో నల్లపూసలొక్కి తెల్లపూస లేదు" అని ఒకావిడె మరొకావిడె చెవిలో చెప్పి, అదోక మాదిరిగా రాధకేసి చూసింది. "ఎందు కమ్మాయ్! అంత కొద్ది జీతంలో ఈ క్లబ్బుకు నెలకు రూపాయి తగలెయ్యడం! మానెయ్యరాదూ! ఆకాస్తా ఏ సూరకైనా వస్తుంది" అని ఒకావిడె ఆనేసరికి...

"అదేమిటండీ! అల్లా మాట్లాడుతారూ? ఆశ ఉంటా లేమిటి? మేమెవరి సొమ్ముకూ ఆశపడ లేదే! 'కందకు లేని దురద బచ్చల కెందుకూ?' మాకు లేని కష్టం మీ కెందు కండీ!" అని రాధ జవాబు చెప్పిందికాని ఆమె కళ్లకి నీళ్లొచ్చాయి. ఇంక అక్కడ ఒక క్షణంకూడా నించో లేక పోయింది. ఆ వేళంతా యెంతో బాధ పడ్డది. భర్తకు మాత్రం చెప్పలేదు ఈ సంగతి. 'ఎందుకూ ఆయన మనస్సు కూడా నొప్పించటం' అనుకుని వూరుకుంది. ఆ తర్వాత రెండు రోజులకు ఆ క్లబ్బులోనే మెంబర్లైన పొరుగింటి వారమ్మాయి వచ్చి "ఏమండీ, రాధమ్మగారూ! క్లబ్బుకు రావడం లేదేం! మీరు వచ్చిన నాలుగు రోజులు ఎంత సరదాగా అనుకున్నాం" అంది.

జరిగిన కథంతా ఆ అమ్మాయితో చెప్పగా, "అదేమి టండీ వాళ్లల్లా అన్నారుకదా! అని మీరు మానెయ్యడ మేమిటి! క్లబ్బంటే వాళ్ల తాత సొమ్మా వాళ్లకు నగ లుంటే వాళ్లేమోస్తారు యెద్దులాగ; మీ కేమైనా యిస్తారా? వాళ్లేదో అన్నారు కాదా అని, మీరు మానెయ్యడమేమి టండీ?, ఒక టంటే నాలుగెదురనాలిగా!" అని ఆ అమ్మాయి బలవంతం చేయగా రాధ మళ్లీ 'వీళ్లతో నేమి టిలే' అనుకుని క్లబ్బుకు రోజూ వెళ్లడమారంభించింది.

అల్లా కొన్ని రోజులయ్యాక ఈ ఆఫీసర్ల భార్యలందరూ 'రాధని' మీ రనడం మానేసి, 'నీవు' అని "ఏయ్ అమ్మాయ్!" అనీ పిలవడ మారంభించారు. పోని వయస్సులో వాళ్లకంటే చిన్నదే అనుకుందాం అయితేమటుకు అవమానంగా పిలవడ మెందుకో! ఆ యీడు వాళ్లనే ఆఫీసర్ల భార్యలైతే గౌరవంగా పిలవడం లేదూ? పోనీ యేమైనా ఎక్కువ కాలం నుంచీ పరిచయం చనువూ వుందా అంటే, అదీలేదు. మరి వాళ్ల ధోరణి కర్థమేమిటి?

అయినా రాధ విద్యావంతురాలు కనుక యిల్లాటి స్వల్ప విషయాల్లో అట్టే బాధపడేది కాదు. మరీ ఆ ఆఫీసర్ల భార్యలకు వుసుకుమోత్తనం యెక్కువౌతోంది, ఆ రోజు కారోజు. యింకా యిల్లా లాభంలేదనుకున్నారు. "ఏమిటీ! ఈ పిల్ల మనతో సమంగా క్లబ్బుకు రావడం, మనతో సమంగా మసలడమూనా? ఏమండోయ్! శక్రటరీగారూ ఇల్లాటి చచ్చుపుచ్చు రకాల వాళ్లంతా మన గౌరవమైన క్లబ్బుకు రావడం నాకు యిష్టం లేదండోయ్. మా ఆయనా చూడబోతే పెద్ద హోదాలో వున్నారు, ఆ పిల్లమొగుడు మా ఆయన ఆఫీసులోనే గుమాస్తా. అతని భార్యతోను నే నాడేదీని, ఈ క్లబ్బులో మసిలేదీని నాఖర్మకాలి! ఈ క్లబ్బు మెంబరుషిప్పుకి రాజీనామా అయినా యిస్తానుగాని, రోడ్డుమీది వాళ్లందరితోటీ నేను ఆడనండోయ్" అంది ఒకావిడె! మిగిలిన మెంబర్లుకూడా, "మేమూ అంతే" అన్నారు. ఇంక రెండోరోజునుండి రాధకు ఆటల్లో జాగా లేకుండా చేసేశారు. ఒకవేళ ఒక మనిషి తక్కువైతే ఆ క్లబ్బు ప్యూన్ని తమతో ఆడేందుకు పిల్చేవారేగాని, రాధని మాత్రం పిల్చేవారుకాదు. పాపం! రాధ యేం చేస్తుంది. పైగా వాళ్లందరు క్లబ్బులో అడుగెట్టింది మొదలుకొని తన కేసి రుసరుస చూడ్డమాయె! ఇంకేం లాభం? పూర్తిగా క్లబ్బుకెళ్లడం మానేసింది.

రాధ మానేసిన రెండవ నెలలో ఒకరోజున కారాగింది, రాధ యింటికెదురుగా! క్లబ్బు ప్రెసిడెంటుగారు పిచ్చమ్మ గారూ, శెక్రటరీ వెంకమ్మగారూ మరి కొంతమందీ దిగారు. రాధ తనకోసరం కాదేమోనని, వాళ్లకోసర మెదురుచూడ కుండా ఇంట్లో పనిచూసుకుంటోంది. ఇంతలో, "రాధమ్మ గారూ! అన్నమాట వినిపించేసరికి గుమ్మంలో కొచ్చింది. ఆపళంగా అంతావచ్చి, ఎక్కడలేని ఆనందం చూపిస్తూ, రాధికి కరస్పర్శచేశారు. "ఏమండీ! ఏమిటీ? ఇల్లా

వచ్చారు! అంది రాధ. కూచోమనకుండానే అక్కడొక చాప ముక్కుంటే అంతా దానిమీద చతికిలబడ్డారు.

"రాధమ్మగారూ! మేము మిమ్మల్ని ఒకటికోరేందుకు వచ్చాం. మీరు ఇదివరకు జరిగినవేవీ జ్ఞాపకముంచుకోక, మా లోటుపాట్లను క్షమించి, వెంటనే తిరిగి మా క్లబ్బులో మెంబరుగా చేరాలి! వచ్చేవారం నెల్లూరినుంచి ఫేమస్ టీమ్‌వారు మన క్లబ్బుతో టెన్నిస్‌పోటీ ఆడేందుకు వస్తున్నారు. మన క్లబ్బులో బాగా ఆడేవారు ఎవరూలేరు. మీరొస్తేతప్ప లాభంలేద"ని అంటూ రాధని బతిమిలాడారు అంతేకాక రాధ పిల్లలని యెత్తుకుని, ముద్దులాడి, బిసకత్తులు అవ్వీ యిచ్చారు. రాధ! ముందుకొంచెం ఆశ్చర్యపడింది. కాని వారినేమీ అనలేదు. "సరే లెండి, దానికేమిటి," నేనుమటుకూ మహా ఆడగలనేమిటి? మీరంతా యివ్వాళ్ళ మా యింటికొచ్చినందుకు చాలా సంతోషంగావుంది" అని బొట్టూ తాంబూలం యిచ్చి గౌరవించి పంపింది.

రాత్రి ముకుందరావు వచ్చాక సంతోషంతో జరిగినదంతా చెప్పింది. ముకుందరావు తనలో నవ్వుకుని, రాధని తప్పకుండా క్లబ్బుకు రోజూ వెళ్ళమన్నాడు.

*　　*　　*

మర్నాడు పొద్దుటే రాధ స్నేహితురాలైన కమల రాధ యింటికి చూడ్డానికివచ్చి మాటల సందర్భాన్ని "అన్నట్టు మన క్లబ్బువారెవరేనా మీయింటికి వచ్చారా నిన్నగాని, మొన్నగాని?" అని అడిగింది.

"మరే, నిన్ననే వచ్చారు కమలా! శెక్రటరీగారూ, ప్రసిడెంటు పిచ్చమ్మగారూ, ఇంకా యెవరో ఒకావిడ వచ్చారు......అవునుగానీ, ఏమిటీ! వాళ్ళ రాక నాకు చాలా ఆశ్చర్యంగావుంది! వాళ్ళలో ఈ పరివర్తనం రావడానికి కారణం ఏమిటంటావ్?" అంది రాధ.

"ఏమిటంటారా! చెప్తా వినండి! మిమ్మల్ని ఆవిధంగా తూలనాడేక మీరు మానేశారుకదా! ఆ తర్వాత బెజవాడ నుండి ఒక టీము వచ్చింది వీళ్ళతో పోటీఆటకి. వాళ్ళతో ఆడి శుభ్రంగా వోడిపోయారు. అప్పటినుండి వాళ్ళల్లో వాళ్ళకి అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. కేవలం ధనమే ప్రధానమా, లేక మనిషియొక్క మంచితనమూ, విజ్ఞానమూ ప్రధానమా అని ఈ విషయం పైని జరిగిన చర్చలో చాలా మంది పాల్గొన్నారు. ఒక్క ధనలోపం కొంచ మున్నంత మాత్రాన ఒక వ్యక్తికి సంఘంలో గౌరవానికే మాత్రం లోపంగా పరిగణించకూడదన్నారు ఒకపక్షంవారు. 'ప్రస్తుత భారతదేశ చరిత్రలో ఏవిధమైన మార్పులొస్తున్నాయ్! హరిజనులను సమంగా సోదరులవలె చూడవలసిన బాధ్యత ప్రతి భారతీయుడిదన్నీ అని గాంధి మహాత్ముడు యెలుగెత్తి ఘోషించుటలేదూ! అందరూ కలిసిమెలిసి ఏకకుటుంబము వలె ఐకమత్యముతో వుండవలెనని బోధించడంలేదూ? ఈ పరిస్థితులలో ధనవంతులైనవారు గర్వించి తమకంటే ధనహీనులను తూలనాడుట కేవలం వారి అజ్ఞానాన్ని తెలుపుతుందిగదా!' అంటూ ఈ ధోరణిలో నేనూ, నాతోపాటు ఇంకా నలుగురం మాట్లాడాము. ఈ చర్చకు ఫలితంగా "ఇకమీద ఎవరైనా సరే సెంచందా చెల్లించి క్లబ్బులో చేరితే వారిని మిగిలిన అందరిలాగే, ధనమున్నా, లేకపోయినా, నగలున్నా లేకపోయినా, సమంగా గౌరవించాలి. ఇదేగాకుండా ఈ మధ్య మన ప్రవర్తన మూలాన క్లబ్బుకురావడం మానేసిన శ్రీమతి రాధమ్మగారిని క్షమాపణ గోరి, ఆమెని తిరిగి క్లబ్బులోచేరమని కోరవలెనూ' అని తీర్మానంగూడా చేశాం. దాని పరిణామమే నిన్న వారు మీ యింటికి రావడం. అదల్లావుండగా వచ్చేవారం నెల్లూరు క్లబ్బువాళ్ళు మనక్లబ్బుతో ఆడేందుకు వస్తున్నారు. అప్పుడు మీరుంటే బాగుంటుందనికూడా అనుకున్నారు."

"సరేగాని కమలా ముందు నా కృతజ్ఞతాభివందనాలు నీకు చెప్పనియ్యి" అంది రాధ.

బిడ్డల పెంపకం

* శ్రీ వి. హనుమంతరావుగారు *

★

ఆరోగ్యవంతుడైన బిడ్డను కన్నతల్లి మురిసిపోయి తన కర్తవ్యాన్ని మరువకూడదు. లేక అనారోగ్యవంతుడైన బిడ్డనుగురించి కన్నతల్లి విచారించ నవుసరంలేదు. సరియైన జాగ్రత్తలు తీసుకొంటే బిడ్డను ఎంత ఆరోగ్యవంతుడిగానైనా చెయ్యవచ్చును.

★



ప్రతి మానవునికి, ముఖ్యంగా తల్లులకు, అందంగాను, బొద్దుగాను, ఆరోగ్యంగాను ఉండే బిడ్డలనుచూస్తే ఎంతో ఆనందమవుతుంది. తనబిడ్డ అట్లా లేకపోతే, "అట్లా ఉంటే ఎంత బాగుండును ?" అని అనుకొంటుంది తల్లి. నిజమే. అట్లా అనుకోకుండా ఏ తల్లి ఉండగలుగుతుంది. అయితే అది ఎట్లా సాధ్యమవుతుంది? ఆరోగ్యవంతులైన పిల్లలను కనటం, పెంచటం తల్లియొక్క జాగ్రత్తలో ఆధారపడి యుంటుంది. అంతేగాని "దేవుడు మనకింతే పోసిపెట్టాడు" అనిగాని, మనం యింతకంటె ఎక్కువ నోచుకోలేదు" అని గాని తల్లులు నిరాశ చెంద నవుసరంలేదు. అది కేవలం పిచ్చిపని.

ముఖ్యంగా పుట్టబోయే బిడ్డయొక్క ఆరోగ్యం, బలం, తల్లియొక్క బలారోగ్యాలమీద ఆధారపడి ఉంటాయి. తల్లి ఆరోగ్యం ఎటువంటిదయితే, అటువంటి ఆరోగ్యమే బిడ్డలోకూడా ప్రతిబింబిస్తుంది. అందుచేత తల్లులయొక్క మొదటి కర్తవ్యం తాము ఆరోగ్యంగాను, బలంగాను ఉండాలి. అందుకు వారు చేయగలిగినంతవరకు అన్ని ప్రయత్నాలు చెయ్యాలి.

పరిశుభ్రత, గాలి, వెలుతురు:—ఈ మూడు బిడ్డయొక్క అభివృద్ధికి చాల ముఖ్యం. మొదట మన పురిటిగదులు చూచినట్లయితే, ఈ మూడు ఏకోశానా కనపడవు. ఒక్క సూర్యకిరణంగాని, ఒక్క పిసరుగాలిగాని లోపలకు రాకుండా తలుపులన్నీ బంధిస్తారు. ఒక నులకమంచం వేస్తారు. ఏమాత్రం శుభ్రంకూడా ఉండదు. సాధారణంగా ఆగదిలో బిడ్డ మలమూత్రాదులు విసర్జించిన గుడ్డలన్నీ ఉంటాయి. 11 దినాలవరకు బయటకు రానీయరు. అటువంటి గదిలో మంచి ఆరోగ్యంగల మనిషి పదినిముషాలుకూడా భరించలేడు. అటువంటప్పుడు పసిబిడ్డ ఎట్లా ఉంటుందో, తల్లులు కొంచెం ఆలోచించాలి. కనుక తల్లులు తమబిడ్డల బాగును కోరేవారయితే, అటువంటి పిచ్చి పిచ్చి ఆచారాలు వదలిపెట్టాలి. గాలి, వెలుతురుగదిలోనికి రావటానికి అన్ని అవకాశాలు కల్పించాలి. పరిశుభ్రత విషయంలో ఏమాత్రం అశ్రద్ధ చూపకూడదు. ఇరుగుపొరుగు అమ్మలక్కలు, యింట్లో ముసలమ్మలు దవుడలు నొక్కుకొంటారు. బెదరవలసిన పని లేదు. సూటిగా జవాబుచెప్పండి. ఏం, యిటువంటి పరిస్థితులలో యితర దేశాలలో తల్లులు బిడ్డలను కనటంలేదూ? వాళ్లంతా చనిపోతున్నారా ?

బిడ్డల పెంపకం

ఇక స్నానం చేయించటం విషయంలో మనవాళ్లు చాల అవకతవకపనులు చేస్తుంటారు. మొదట కావలసిన పరికరాలన్నీ తెచ్చుకోవటం మరచిపోతుంటారు. ఆ వస్తువు అవసరం వచ్చేవరకు ఏమీ తెలియదు. అవసరం వచ్చినతర్వాత ఆ వస్తువు వచ్చేలోపుగా బిడ్డ నీళ్లలో నానుతూ ఉంటుంది. ఉపయోగించే నీటియొక్క వేడిని ఉజ్జాయింపుగా చేతితో చూస్తారు. నీళ్లుపోసినతర్వాత, బిడ్డ గట్టిగా ఏడిస్తే అప్పుడు మళ్లీ చన్నీళ్లుపోస్తారు. బిడ్డ ఎర్రబడటానికి గట్టిగా రుద్దేపిచ్చి తల్లులుకూడా లేకపోలేదు. ఇవన్నీ పైకి చాలా చిన్నవిషయాలుగా కనబడినా, బిడ్డ విషయంలో చాల ప్రాముఖ్యత వహిస్తాయి.

ప్రతిదినం స్నానం 5 లేక 6 నిముషాలకన్నా ఎక్కువ స్నానం చేయించకూడదు. 36 సెంటిగ్రేడుకన్నా ఎక్కువ ఉష్ణతగల నీరు వాడకూడదు. ముఖాన్ని శుభ్రం చెయ్యటానికి వేరే నీరు ఉపయోగించాలి. స్నానం అయిన వెంటనే మెత్తటి గుడ్డతో తడిని ఒత్తివెయ్యాలి. శిరస్సు విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా మెదడుకు అపాయం కలుగవచ్చు.

ఆహారం :

ఆహారం యివ్వటంలో ఎంత క్రమపద్ధతిని అవలంబిస్తే, బిడ్డ అంత ఆరోగ్యంగా ఉంటాడు. ఏడ్చినప్పుడల్లా పాలు ఇవ్వటం, బిస్కట్లు మొదలైన వస్తువులు పెట్టడం, బిడ్డకేమి వస్తుందో అని భయపడి, కడుపునిండా పాలు యివ్వకపోవటం—ఇట్లా చెయ్యటం బిడ్డమీద ప్రేమ చూపించడమనుకోంటుంది. కాని అది ప్రేమచూపించటం కాకపోగా బిడ్డయొక్క ఆరోగ్యాన్ని చేతులార పాడుచేయడమన్న మాట. ఎవరికైనా పెద్ద జబ్బుచేసి పథ్యం పెట్టిన తర్వాత, డాక్టరు ఆ జబ్బుచేసిన వ్యక్తిని చంటిపిల్లకన్నా ఎక్కువ జాగ్రత్తగా చూడాలంటూ సలహాయిస్తాడు. ఎందుచేత? వారియొక్క జీర్ణశక్తి అంత సున్నితంగా ఉంటుందన్న మాట.

అయిదు నెలలు గడిచేవరకు తల్లిపాలుతప్ప యింకేమీ ఇవ్వకూడదు. మీ అందరికు కాఫీ అంటే ఎంత ప్రాణమో, పసిబిడ్డలకు పాలు అంటే అంత ప్రాణం. అదే వాళ్లకు అమృతం. మూడుగంటలకొకసారి పాలుయిస్తూ, రాత్రి 6 గంటలు విరామమివ్వాలి. ఇట్లా 3 నెలలవరకు చెయ్యాలి. సాధారణ ఆరోగ్యంగల బిడ్డ తల్లిపాలు 5 మొదలు 10 నిముషాలవరకు త్రాగుతుంది. బలహీనమైన బిడ్డకు 15 లేక 20 నిముషాలవరకు యివ్వవచ్చును. ఏవిధంగానైనా, త్రాగేపాలయొక్క పరిమాణము (Quantity) ఒక్కటే. ఎందుచేతనంటే, బలహీనమైన బిడ్డ పాలు త్రాగటానికి ఎక్కువ కాలం పడుతుంది. పాలిచ్చేముందు, తల్లి తన రొమ్మును పరిశుభ్రం చెయ్యాలి.

తన పాలు ఆరోగ్యంగాను, బలకరమైనవిగానుండటానికి, తల్లి మంచిపండ్ల రసములు, తాజా కూరగాయలు (టమోటో మొ॥) ఎక్కువగా తీసుకోవాలి. ఇవి తీసుకోవటంవల్ల పాలు ఎక్కువగా రుచికరంగాకూడా ఉంటాయి.

బిడ్డ పెరిగేకొలది ఆహారాన్ని మారుస్తూయుండాలి. 6 నెలలు దాటిన తర్వాత 4 సార్లు మాత్రమే పాలుయిచ్చి మిగతసమయాలలో తేలిక ఆహారాన్ని యివ్వాలి. సంవత్సరం దాటిన తర్వాత తల్లిపాలు పూర్తిగా మానివెయ్యాలి. వేసవి దినాలలోమాత్రం ఒకటి రెండుసార్లు ఈయవచ్చును. ముచ్చటకోసం చిన్నప్పుడు కాఫీ త్రాగటం నేర్పుతారు. ఇది చెడ్డ అలవాటని తెలిసికూడా తల్లులకు కాఫీ యివ్వటానికి చేతులు ఎట్లా వస్తాయో నాకర్థంకాదు.

బిడ్డ తీసుకొనే ఆహారంలో విటమిన్లు లేకపోవటంవల్లనే బిడ్డ బలహీనంగా ఉండటానికి ఒక కారణమని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అందుచేత, 6 నెలలు దాటినతర్వాత, పండ్లరసం (బత్తాయిదైనా) యివ్వటం ప్రారంభించి 10 చుక్కలు మొదలు 10 చెంచాలవరకు హెచ్చించుకొంటూ వెళ్లాలి. ఈ పండ్లరసం ఎంతో పరిశుభ్రంగాను, ముత్యాలు వగైరాలు లేకుండా ఉండాలని వేరేచెప్ప నవసరములేదనుకొంటా.

బిడ్డకు బజారులో మిఠాయి వస్తువులు కొని తీసుకొని వచ్చి పెట్టడమంత తెలివి తక్కువ యింకొకటిలేదు. అది బిడ్డకు ముద్దు కాదు ముప్పు. అంటు వ్యాధులు ప్రబలి ఉన్న రోజులలో వేరే చెప్పనవసరంలేదు.

నిద్ర !

ఇంక నిద్ర విషయం చూద్దాం. సాధారణంగా తల్లులు తమ బిడ్డలను తమ ప్రక్కనే పడుకోబెట్టుకొంటారు. యిది ఎంత దురలవాటో అంత ప్రమాదకరం. పుట్టిన దినం నుంచి, బిడ్డను వేరే మంచం మీదగాని, తొట్టిలోగాని పరుండ బెట్టాలి. బిడ్డ అటు యిటు దొర్లటానికి తగినంత స్వేచ్ఛ ఉండాలి. గుడ్డ ఊయలకూడా ఎంతమాత్రం పనికి రాదు. గాలి రావటానికి తగినంత అవకాశం ఉండాలి.

మొదటి అయిదారు నెలలలో దినానికి 3 గంటలు తప్ప మిగతసమయమంతా పాప నిద్రబోతుంది. ఈ నిద్రను ఎంత మాత్రం భంగపరచ కూడదు. నిద్ర బోతున్నపుడు లేపితే ఎంత చిరాకు, ఎంత నిరాశ పొందుతామో మీ అందరకు తెలిసిన విషయమే. పాలు యీయవలసిన టైముకు లేవక పోయినట్లయితే ఒక అరగంట వరకు చూసి, అప్పుడు మెల్లిగా లేవదీయాలి. ఈ మధ్యకాలంలో ఏడ్చినట్లయితే తల్లివచ్చి లేవదీయకుండా జోకొడితే, వెంటనే నిద్ర పోతుంది. తండ్రి వచ్చినాడని ఒకతూరి, చుట్టాలుపక్కాలు వచ్చినారని యింకొక మారు యిట్లు నిద్రను పాడు చెయ్య కూడదు.

ముఖ్యంగా పసిబిడ్డలు ఏడ్చేటప్పుడు సముదా యించట మనేది తల్లులకు ఒక పెద్ద సమస్య. ఆరు నెలలవరకు పిల్లలు ఊరకనే ఏడుస్తారు. తల్లి వచ్చి చూస్తుంది కారణం కనబడదు. అడిగితే చెప్పలేదు. ఎంతో బాధపడుతుంది. ఈ ఏడుపుకు కారణాలు : (1) నిద్రనుంచి లేచేసరికి తల్లి దగ్గరగా లేకపోవటం ; (2) పరుండ బెట్టిన ప్రక్క ఒత్తుకోవటం ; (3) ఆకలి వెయ్యటం. బిడ్డ ఏడ్పు ప్రారంభించిన వెంటనే, తల్లి దగ్గరకు వెళ్లాలి. తల్లి కనపడటంతోనే బిడ్డలు కొంతమంది ఏడుపు మానివేస్తారు. తల్లి దగ్గర ఉంటేచాలు బిడ్డలు ఒక విధమైన Security ని feel అవుతారు. యింకా ఏడుస్తుంటే పై కారణాలుగాని యింకా ఏ ఇతర కారణాల వల్లగాని ఏడుస్తుందో గమనించాలి. యిట్లా చెయ్యటంవల్ల కొన్నాళ్లకు బిడ్డ ఏడుస్తుంటే నిజంగా బాధకలిగి ఏడ్చిందీ, కారణం లేకుండా ఏడ్చిందీ తల్లులు సులభంగా తెలుసుకో గల్గుతారు.

కొంతమంది తల్లులు, బిడ్డ ఎంతోసేపు గుక్కపట్టి ఏడిస్తే నేగాని దగ్గరకు రారు. మరి కొంతమంది తల్లులు బిడ్డ ఏడ్చి నట్లయితే వెంటనే వచ్చి ఎత్తుకోవటం, పాలు పట్టడం, యింకొకరిని ఎత్తుకోమని పురమాయించటం యిట్లా ఆ బిడ్డను చంకదిగనియ్యకుండా చేస్తారు. పై రెండు విధాల చెయ్యటం ఎంత చెడ్డ అలవాట్లో అంతహానికరం కూడాను. చెడ్డ అల వాట్లు అని తెలిసికూడా తల్లులు ఈ పనులు చేస్తారు.

పై విధంగా చిన్నప్పటినుంచి బిడ్డను ఎంత క్రమ శిక్షణ తో పెంచగలిగితే, బిడ్డలు అంత ఆదర్శవంతంగా తయారవు తారు. తల్లికి ఎంతో గర్వ కారణమవుతుంది. తల్లులు చేసే లోటుపాట్లు ఎంతో చిన్నవిగా కనుపించినా, బిడ్డలను పాడు చెయ్యటంలో మాత్రం ఎక్కువ ప్రాముఖ్యత వహిస్తాయి.

పిల్లలను తగిన జాగ్రత్తలతో పెంచినట్లయితే, వారు తమ జీవితాలకు గుదిబండలవలె కనుపించరు. చీటికి మాటికి జబ్బులు రావు. ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. ఎంతో ఆనందాన్ని ఇస్తారు.

★



ఉత్తమ దేశసేవికలను తర్ఫీదు చేస్తున్న శిక్షణా విధానం

సీతానగర సత్యాగ్రహాశ్రమములో నిర్వహింపబడుచున్న దేశసేవికా శిక్షణ కేంద్రము యొక్క విశిష్టత ఆంధ్రావనిని ఆకర్షిస్తున్నది. నిర్మాణ కార్యక్రమమందాసక్తిగల సోదరీమణులకు ఆశ్రమము నేడు తీర్థవాటిక యైనది. శిక్షణ కేంద్రమును యీ మధ్యసందర్శించినవారిలో ముఖ్యులు విదుషీమణి ఆదుర్తి భాస్కరమ్మ గారు. వీరి అభిప్రాయములను ఆంధ్ర మహిళ కృతజ్ఞతతో ప్రకటిస్తోంది. —సం॥

శ్రీ గాంధీమహాత్ముని జన్మ దినోత్సవ సందర్భంలో ఉత్సవ ప్రారంభమును చేయవలయునని సీతానగరము నందలి గ్రామ సేవికా శిక్షణ క్రేంద్రంలో పని చేయుచున్న ఉపాధ్యాయినులు నన్నాహ్వానించిరి. ఈ సెప్టెంబరు నెల 25వ తేదీని నేను అక్కడి పాఠశాలను చూడవలయునను కుతూహలముగల యిక్కడి ప్రభుత్వోన్నత బాలికా పాఠశాలా ప్రధానోపాధ్యాయిని (The Superintendent of the Govt. Secondary & Training School for women, Rajahmundry,) శ్రీమతి ఎ. కోటమ్మగారు, హాస్టలు సూపరింటెండెంటు శ్రీమతి భో. హనుమాయమ్మ గారు సీతానగరము వెళ్లితిమి. ఆ ప్రదేశము అక్కడి వాతావరణము, ఉపాధ్యాయినులు విద్యార్థినులు ఉండే విధానము, వారు చేసే అతిథి సత్కారము మొదలగు వానిని చూచుటకు చాలా సంతోషమైనది. ఈ కేంద్రము పూర్వపు గురుకులాశ్రమములను జ్ఞప్తికి తెస్తోంది.

ఉపాధ్యాయినులు, విద్యార్థినులు కూడా చాలా సరదాగాను, ఉత్సాహంగాను ఉన్నారు. ప్రతి పని అతి ఖచ్చితంగా కాలనియమము ననుసరించి సకాలములో చేస్తున్నారు. వారి వారికి నియమింపబడిన విధ్యుక్త కార్యముల నమితోత్సాహముతో నెరవేర్చు చున్నారు. విద్యార్థినులందరూ చాలా పరిశుభ్రముగానుండుటచేత కుల మత భేదములు చెపితేనే తప్ప తెలియుట లేదు. వారి క్రమ శిక్షణ, ఉత్సాహము, చురుకు, వంటయింటి శుభ్రత, సాయంకాలపు బహిరంగ సభలో ప్రదర్శించిన వినోదములలో వారు చూపిన ధైర్య స్థైర్యములు, నేర్పు మొదలగునవి ప్రశంసా పాత్రములై యున్నవి. ఒకటి, రెండు మూడు తరగతుల చిన్ని బాలికలు హావ భావ సహితముగా పాడిన అభినయ గీతములు, చేసిన సంభాషణములు ముద్దుగాను, హృదయాహ్లాదకరముగాను ఉన్నవి. శ్రీమతి సుభద్రా దేవిగారిచే ట్రైనింగు విద్యార్థినులకు నేర్పబడుచున్న డ్రిల్లు సైనిక శిక్షణమువలె నున్నది కాని సామాన్య డ్రిల్లువలె లేదు. ఈ పై విషయములన్నిటిని నేనే గాకుండా నాతో కూడా వచ్చిన పై యిరువురూ కూడా చాలా మెచ్చుకొనిరి. అనేక విధములగు మనస్ప్రవృత్తులు, స్వభావములు, అలవాట్లుగల యువతుల నొక పద్ధతిలో పెట్టి వారి కట్టి చక్కని శిక్షణ నొసంగగలిగిన యుపాధ్యాయినుల యొక్క నేర్పు, ఓపిక మెచ్చతగినవి. వారికి మా అభినందనములు.

ప్రస్తుత మక్కడ శిక్షణ పొందుచున్న విద్యార్థినులందరూ వారి ఉపాధ్యాయినులవంటి యున్నతాశయములు గలవారై వారి ననుసరించి ప్రవర్తింపగల వారైయైన యెడల నచిరకాలములోనే మన గ్రామవాసులు విజ్ఞాన వికాసములతో ప్రకాశింపగలరనుటకు సందేహము లేదు. ఈ శిక్షణ కేంద్ర స్థాపకుల కృషి త్వరలోనే ఫలితమునకు రాగలదు.

★

స్వదేశ సంస్థానములు

★

["సోదరీమణులకు మనవి" అనే పుస్తకములోని నాలుగవ అధ్యాయము. మొదటి మూడు అధ్యాయములు ఆంధ్రమహిళలో వరుసగా ప్రకటింపబడినవి.]

★

ఒక సంస్థానములో పుట్టిపెరగటమువల్ల, ఆ రాజవైభవ ఆడంబరాల మధ్య బాల్యము చాలవరకు గడపటమువల్ల నేను సంస్థానముల శ్రేయస్సును అభిలషించటములో వింత లేదు. మన దేశీయ పాలకులు యింకా తమకు ఉచితమైన అంతస్థుకు రాలేకపోవటము చాల శోచనీయము. తత్ఫలితముగ హైందవ హిందూదేశము ఆంగ్లేయ హిందూదేశము కన్న ఉచ్ఛస్థితిలో లేకపోగా అక్కడక్కడ అధోస్థితిలో కూడ వుంటున్నది. అప్రధానములైన వైభవ ఆడంబరములకు ప్రాముఖ్యత యివ్వబడుతున్నది. అంగ్లేయ హిందూదేశ పరిపాలనావిధానము తలాతోకలేకుండ కొంతవరకు అనుకరించబడుతున్నది. పాలకులకు తమ విధాయకమును సరిగా నెరవేర్చుకొనుటకు తగిన తర్ఫీదుగాని, విద్యగాని వుండటము లేదు. ఆ కొరతే భావిభారత ప్రజాప్రభుత్వములో వీరికి స్థానము వుండదేమోనన్న సహజభీతిని కలిగిస్తున్నది. ప్రజాప్రభుత్వమని తెలిసి కావాలనే అన్నాను. స్వాతంత్ర్యము పొందగానే భారతదేశము సార్వజనిక దేశము కాగలదని నా గట్టి నమ్మకము, కాని యీ రచన కేవలము స్త్రీలకొరకే నిర్దేశింపబడి వుంటమువల్ల సంస్థానవాసినులగు సోదరీమణుల కర్తవ్యాన్నిగురించి ఆలోచించటము ప్రస్తుత అంశము. ఇంతకుముందు ప్రకరణాలలో చెప్పిన, స్త్రీలు చేయతగిన నగరగ్రామాలసేవా విధానమే వీరికికూడ అనువర్తిస్తుంది. తమ తమ స్థానములలో జరిగే సమాజ గ్రామసేవలలో ఆయా సంస్థానాధీశ్వరిణులు తప్పక పాల్గొనవచ్చునని, పాల్గొని యితరులకు మార్గదర్శకులు కావాలని నా అభిమతము. మనలోని విద్యావతులు ధనవతులుతోటి స్త్రీ ప్రజానీకముతో యేవిధముగా సంబంధములేకుండ వుంటున్నారో ఆ విధముగానే సంస్థానాధీశ్వరిణులుకూడ తమ ప్రజలలోవున్న పేదలతో సంబంధములేక వుంటున్నారు. ఈ యిరుతెగల మధ్యనున్న అగాధము పూడిపోవాలి. ఇంకాయింకా జీవితము నిరాడంబరముగా చేసుకుని వ్యర్థపు దుబారా ఖర్చులను విలాసాలను తగ్గించాలి. రాచకన్యలకు ఆదర్శప్రాయముగా వుండగల చక్కనివిద్య నివ్వాలి. భర్త మరొక వివాహము చేసుకోవటాన అధోగతి పాలయిన రాచస్త్రీలు, తమ బిడ్డలను తిరిగి అటువంటి పురుషులకే యిచ్చి పెండ్లిచేయకుండ ప్రతిఘటించాలి. పరదా దురాచార నిర్మూలనానికి పూనుకోవాలి. సంస్థానములో యే సంస్కారమైనా ఆచరణలోకివచ్చి సమాజ నాగరికత పేరు పొందాలంటే పాలకులు స్వయముగా మార్గదర్శకులు కావాలి. అనువాయిగా వంశ మర్యాదగా తరతరాలనుంచి వుంటున్న అనర్థదాయకమైన కొన్ని కొన్ని దురాచారాల మధ్య రాచస్త్రీలు నిస్సహాయులై అణగిపోవటము శోచనీయము. సాహసమే జయమనేసూక్తిని అనుసరించి వీరు మౌనముగా కష్టములను సహించటముమాని ఆత్మరక్షణకు పూనుకోవాలి. జరుగుతున్న అన్యాయమును గుర్తించి సహానుభూతి చూపగల ప్రజలు చాలమందివుంటారు. సంస్థానాధీశ్వరిణులు తమ పాలనలోవున్న స్త్రీల అభ్యుదయ, ఔన్నత్యములకు దోహదము ఇవ్వగలిగి వుండాలి. తలుచుకుంటే, తగిన గృహసౌకర్యాలు, మంచినీటి వసతులు, రోగ

రచన:
రాజకుమారి అమృతకౌర్

★

తర్జుమా:
శ్రీమతి అచ్యుతుని గిరిజ

నివారణకై ఆరోగ్యవిధానపెంపు, వైద్యసహాయము, మాతా శిశు ఆరోగ్య కేంద్రాలు, పురుషులతో సమానముగ బత్యాలు, బేసిక్ విద్యాభివృద్ధి, నర్సరీస్కూళ్లు, గృహ పరిశ్రమాభివృద్ధి, ఇటువంటి సహాకారాలు ఎన్నో తమ పాలనలోవుండే స్త్రీలకు చేయకలుగుతారు. ఇంకా అస్పృశ్యతా నివారణ, గ్రామోద్ధరణ, సంఘ సంస్కారములుకూడ చేయగలరు. ఇవన్నీ చేయటము తమ హోదాకు లోటని బ్రిటిష్ ఇండియాలో ఉద్యోగస్తులు జంకినట్లు స్వదేశ సంస్థానములలో వీరు జంకవలసిన అవసరములేదు. పైచెప్పిన సహాకారాలు తమ ప్రజలకుచేసిన సంస్థానాలుకూడ చాల వున్నవి. కాని అదొక సముద్రములో కాకిరెట్టవంటిది. పాలిత ప్రజలకు పాలకులకు మధ్యనున్న అగాధమును పూడ్చటము సంస్థానాధీశ్వరిణుల కర్తవ్యము. వారు స్వయముగా పూనుకుంటే సంస్థానములోని స్త్రీలు అందరు సహకరిస్తారు. ముందు ముందు ప్రజాస్వామ్య రాజ్యాలే భారతదేశములో వుండగలవని సంస్థానాధీశులు యిప్పటినుంచే గమనించటము శ్రేయస్కరము. పాలకులు తమ ప్రజలకుచేసిన సేవనుబట్టి సంస్థానాధిపతులుగా ఎన్నుకోబడేటట్లయితే ఎంత అద్భుతముగా వుంటుంది!

అశ్రుతర్పణం

శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారు సెప్టెంబరు 30 వ తేదీ తెల్లవారుగట్ల 4 గంటలకు అస్తమించారు. ఆంధ్ర దేశానికికాదు దక్షిణ భారతావనికే తీరని కొరత వాటిల్లింది.

అవి "మాలపిల్ల" రోజులు. దక్షిణాపథమంతటా రామబ్రహ్మ సంస్కరణతో మారు మ్రోగింది. విమర్శాప్రియులు, అసూయపరులు, సంస్కరణ నిరోధకులు ఏకమ్మడిగా రామబ్రహ్మంగారి నూతన చిత్ర కృషిపై కత్తి దూసి, వారి సాహసాన్ని మొదలంటు అణచివేయాలన్న కృత నిశ్చయంతో ముందుకు వచ్చారు. కొన్ని పత్రికలు, ప్రజలు, సభలు, సంఘాలు ముందెన్నడు లేని మతాభిమానాన్ని ఆపాదించుకుని వారి చిత్రాన్ని బహిష్కరించాలని ఘోషించారు. సారధి వారి రథసారధి రామబ్రహ్మం ఆ ప్రతిబంధకాలన్నింటినీ సమర్థతతో ఎదిరించి తన కృషి దిగ్విజయంగా సాగించాడు.



తెలుగు చిత్ర నిర్మాతల కొక నూనతపంథా నూతన గుణపాఠము నేర్పింది ఈ ఉన్నత నిర్మాతయే. పౌరాణిక యుగంలో కృంగిపోక పురాతన ఘనతల సంస్మరణలో విస్మయులు గాక సంఘ పురోభివృద్ధిని అరికట్టుచున్న దురాచారాలను నాశనం చేయగల ఆదర్శ చిత్ర నిర్మాణానికి పూనుకోమని శంఖారావం చేసింది రామబ్రహ్మమే.

రామబ్రహ్మంగారి ప్రతీతి ఒక్క చిత్ర జగత్తులోనే కాదు. దేశసేవ, పత్రికారచన, ప్రచారము, నాట్యకళాభివృద్ధి, ఔదార్యము వీటన్నిటిలోను రామబ్రహ్మంగారిది అందెవేసిన చెయ్యి. సహాయ నిరాకరణోద్యమ కాలంలో విద్యకు స్వస్తి చెప్పి జాతీ యోద్యమంలో దుమికాడు. సత్యాగ్రహ సమయంలో సత్యాగ్రహ శిబిరం నడిపి దేశభక్తి పెంపొందించాడు. పత్రిక నిర్వాహణకు పూనుకొని 'సమదర్శని', 'ప్రజామిత్ర' పత్రికల ద్వారా జాతీయ భావాలను ప్రజల్లో రేకెత్తించాడు. సినీమాయుగం రాకతో మూలబడ్డ నాట్యరంగానికి, పునర్జీవ ప్రాప్తి కల్గించి విచ్చల విడిగా విరాళాలిచ్చి పెంపొందించాడు. నాట్యకళామండలి కార్యదర్శిగాను, ఆంధ్రగాన కళామండలి అధ్యక్షుడుగాను అపార సేవచేశాడు.

తారల తయారులో రామబ్రహ్మం సిద్ధహస్తుడు. దక్షిణ దేశమంతా ఎక్కడెక్కడయని ఎదురుచూస్తున్న కాంచనమాలకు చిత్ర రంగంలో శాస్వతస్థాన మేర్పరచింది—ఈ మేధావియే. సుందరమ్మ, వరలక్ష్మి, లక్ష్మిరాజ్యం, సూర్యకుమారి, సూరిబాబు, ఉమామహేశ్వరరావు, ఒకరేవిటి ఈనాడు ఒహో అనిపించుకో కల్గిన అనేకమంది ప్రసిద్ధ నటీనటులకు సుస్థిర జీవిత పంథాలనేర్పాటు చేసింది రామబ్రహ్మమే ననుటలో అతిశయోక్తి లేదు.

అట్టి ప్రజ్ఞావంతుడు, ఉదార భావుడు నడివయస్సులో 44 వ ఏట అస్తమించడం ఆంధ్రుల దౌర్భాగ్యమే. ఆ కీర్తికాముని నామధేయం ఆంధ్రలోకమందు చిరస్థాయిగా ఉండునట్లు చేయడం ఆంధ్రులందరికి ప్రథమ కర్తవ్యం.

★

గుడివాడలో మహిళా సమావేశము
మహిళా కాంగ్రెస్ ప్రారంభోత్సవము
మద్రాసులో రాజకీయ పాఠశాల

గుడివాడ మహిళా సభ

గుడివాడ మహిళాసభ మొన్న సెప్టెంబరు ఆఖరివారంలో శ్రీమతి అట్లూరి అనసూయా దేవిగారి అధ్యక్షతను జరిగింది. సూరపనేని మనోరమాదేవిగారు మహిళాసభ కార్యనివేదిక చదివిన పిమ్మట శ్రీమతి ఈశ్వపగంటి రత్నమాంబగారు సభను ప్రారంభిస్తూ యిల్లా ఉపన్యసించారు. జనాభాలో సగంమంది స్త్రీలై యున్నప్పుడు, వారికి వ్యక్తిత్వం లేక పోవడం, శాసన సభల్లోను తదితర సంస్థల్లోను వారికి తగినంత ప్రాతినిధ్యం లేక పోవడం చాల శోచనీయమైన విషయ మన్నారు. అయితే ఈ హక్కులు అవకాశాలు ఒకరు సంపాదించి పెట్టేవి కావు. మన స్త్రీలు ఐక్యత, క్రమ శిక్షణ ద్వారా, మన కర్తవ్యాలను సక్రమంగా నెరవేరుస్తూ కార్యభారం వహించి దేశకళ్యాణానికి తోడ్పడుతూనే సేకరించాలి. పురుషులకు స్త్రీలు బానిసలనే ప్రవృత్తి మారాలి. స్త్రీ పురుషులు కలిసిమెలసి దేశాభ్యుదయానికి పాటుపడాలి అన్నారు.

అ తర్వాత అధ్యక్షులు శ్రీమతి అట్లూరి అనసూయాదేవి గారు మాట్లాడుతూ స్త్రీలకుకూడ పురుషులతో బాటు అన్ని కార్య క్షేత్రాల్లోను సమాన అవకాశాలు కల్పించాలన్నారు. స్త్రీ పురుష భేదం నశించి అంతా కలిసి జాత్యభివృద్ధికి తోడ్పడాలి. స్త్రీలకు పౌరసత్వపు హక్కులు, విడాకు హక్కులు వుండాలి. విద్యావిధానంలో స్త్రీలకు అవసరమైన కళలు, గృహపరిశ్రమలు మొదలైన వాటికి ప్రాముఖ్యత యివ్వాలన్నారు. శాసన సభల్లోను స్థానిక సంస్థల్లోను స్త్రీల సంఖ్యను బట్టి యెక్కువ స్థానాలు కావాలని, స్త్రీలకు స్థిరాస్థుల్లో సమాన హక్కులుండాలని మద్రాసు శాసన సభలో తీర్మానం ప్రవేశ పెట్టినందుకు శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారిని అభినందించారు. ఆ తర్వాత నూతన సంవత్సరానికి కార్యనిర్వాహ వర్గాన్ని ఎన్నుకోవడంతో సభ ముగిసింది.

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు మహిళా మహాసభ

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు మహిళా మహాసభ 6 వ తేదీని నెల్లూరులో శ్రీమతి రుక్మిణీలక్ష్మీపతిగారి అధ్యక్షతను అతి వైభవంగా జరిగింది. శ్రీమతి బత్తుల కామాక్షమ్మ, కలగర పిచ్చమ్మ, వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ మొదలైన ఆంధ్ర స్త్రీ రత్నాలెందరో అన్ని ప్రాంతాలనుంచి సభకు వచ్చారు.

జాతీయ పతాకారోహణోత్సవం శ్రీమతి గొగినేని భారతీదేవిగారు జరిపేరు.

తదనంతరం శ్రీమతి పొణకా కనకమ్మగారు స్వాగతోపన్యాసం యిస్తూ యీలా ముచ్చటించారు. మనకు స్వరాజ్యం సంపూర్ణంగా కరతలామలకంగాక పోయినా పొలిమేరవరకు వచ్చింది. రాష్ట్రాల్లో కాంగ్రెసు ప్రభుత్వాలు ఏర్పడ్డం, కేంద్రంలో జాతీయ ప్రభుత్వం అధికారం స్వీకరించడం చాల ఆనందకరమైన విషయం. ఇదంతా అరవై ఏళ్లుగా కాంగ్రెసు మహా సంస్థ స్వాతంత్ర పోరాటానికి జరిపిన కృషియొక్క ఫలితం. ఇక స్త్రీలు గావించవలసిన నిర్మాణ కార్యక్రమంలో ప్రతీ గ్రామాన్ని స్వయంపోషకంగా చేయాలి, ఇందులో స్త్రీలు విరివిగా పాల్గొన టానికి ప్రభుత్వంకూడా అవకాశా లేర్పరచాలి. స్త్రీలు ఇలాంటి వాటికి అందెవేసిన చేతులు. వారు పాల్గొన్నట్లయితే జయప్రదంగా జరుగుతుంది. ఇప్పటి విద్యావిధానం చాల లోపభూయిష్టంగా వుంది. స్త్రీలకు

మహిళలలో జాగృతి

పురుషులకు అనుకూలమైన నూతన విద్యాప్రణాళికను నిర్ణయించాలని ఆమె చెప్పారు. హరిజనులకు అన్ని దేవాలయాల్లోను ప్రవేశ మివ్వాలన్నారు. జమీందారీ విధానం, భూస్వామ్య పద్ధతి తొలగి పోవాలన్నారు. స్త్రీలకు అన్ని సంస్థల్లోను పురుషులతో సమాన ప్రాతినిధ్యం వుండాలని చెప్తూ స్త్రీలు తమ హక్కుల్ని కాపాడుకుంటూ బాధ్యతల్ని చక్కగా నిర్వహించాలన్నారు.

తర్వాత శ్రీమతి కడప రామసుబ్బమ్మగారు యీ విధంగా చెప్పేరు. నేటి ప్రపంచం అద్భుత చైతన్యం పొందుతూ వుంది. భారతదేశంలో ప్రజానాయకులు ప్రభుత్వ స్థానాల్లో గద్దెల నధిష్టించి అనేక క్లిష్ట సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇట్టి సమయంలో స్త్రీలు పురుషులు ప్రభుత్వానికి తమ పూర్తి సహకారాన్ని యిచ్చి యీ క్లిష్ట సమస్యల పరిష్కారానికి తోడ్పడాలన్నారు. ఇంకా హిందూ ముస్లిమ్ ఐక్యతను గురించి ముచ్చటించారు. అంటరానితనాన్ని స్త్రీలే బాపగలరు—బాపాలన్నారు. ప్రతీ ఉద్యమంలోను పురుషులతోబాటు స్త్రీలు కూడ మానవ సేవ చేయాలన్నారు.

ఆ పిమ్మట అధ్యక్షురాలు శ్రీమతి రుక్మిణమ్మగారుపన్యసించారు. ఇటువంటి మహాసభల్లో సమాన్యంగా పురుషులే యెక్కువగా పాల్గొంటారు. ఇప్పుడు మనమూ ఇంత కృషి చేస్తున్నందుకు చాల ఆనందం. ప్రపంచంలో ప్రతీ బానిస దేశం స్వతంత్రం కొరకు పోరాడుతూయుంది. మనం 200 సం.ల నుండి బానిసలగావున్నాం. మహాత్మాగాంధిగారిచ్చిన అహింస అనే అద్భుత ఆయుధాన్ని చేబూని స్వరాజ్యం కొరకు పోరాడు తున్నాం. ఈ స్వాతంత్ర పోరాటంలో మనమూ పురుషులతో సమానంగా పని చేసేం; ఇంకా చేయవలసి యుంది. రాజ్యం—రాముడు పరిపాలించినా—రావణుడు పరిపాలించినా—మన కర్తవ్యం మనం నిర్వహిస్తూ ధైర్య సాహసాలు చూపాలి.

మనకు ముప్పాతిక వంతుల స్వరాజ్యం వచ్చింది. ప్రజలు తిండి—బట్టలకు లోటులేకుండా సుభిక్షంగా వుండాలని ప్రజానాయకులు అహోరాత్రాలు కృషి చేస్తున్నారు. వారి కార్యకలాపాలలో మనం పూర్తి సహకారం యిచ్చి సాయశక్తులా తోడ్పడాలి. ఆహార సమస్య తీవ్రత కొంచం తగ్గింది. కాని గుడ్డ కఱువు పెరిగి పోతూయుంది. దీని పరిష్కారానికి ప్రతీ స్త్రీ పురుషుడూ కూడా నూలువడకాలి. ఇప్పుడు మద్య నిషేధం 8 జిల్లాలలో అమలు పెట్టారు. ఇది జయప్రదం కావాలంటే స్త్రీలే శ్రద్ధ వహించి ప్రచార ప్రభోదాలు చెయ్యాలి. గాంధిగారి మూలసూత్రాలు మద్యపాన నిషేధం, అస్పృశ్యత, ఐక్యత వీటిని అక్షరాలా అనుసరించాలి. స్త్రీలు ముందుకు వచ్చి ప్రతీ కార్యరంగంలోను సహకరించి దేశ కల్యాణానికి పాటుపడాలని దివ్య ప్రభోదంగావించేరు.

శ్రీమతి కలగర పిచ్చమ్మగారు జాతీయ పతాకాన్ని యెగుర వేసేరు. తరువాత మిసెస్ మేరీ క్లబ్ వాలా మొదలైన వారు ఉపన్యసించారు.

సమావేస సందర్భంలో కస్తూరిదేవి విద్యాలయ స్వచ్ఛంద సేవిక విద్యార్థినులు వచ్చిన వారికి చేసిన ఆదర సత్కారాలు చాల ప్రశంసనీయంగా ఉన్నాయి.

స్త్రీలకు రాజకీయ పాఠశాల

ఆంధ్రరాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాల ఒకటి స్త్రీలకు రాజకీయ శాస్త్రంలో తర్ఫీదు నివ్వడానికై మద్రాసులో యీ నెల 11వ తేదీని ప్రారంభించేరు. ఆచార్యరంగాగారిచే ప్రారంభోత్సవం జరుపబడింది. శ్రీ గొల్లపూడి సీతారామ శాస్త్రిగారు అధ్యక్షత వహించారు. శ్రీమతి పొణకా కనకమ్మగారు స్వాగతోపన్యాస మిచ్చారు.

శ్రీ ఆచార్యరంగాగారు ప్రారంభోపన్యాసం గావిస్తూ మన స్వాతంత్ర ఆందోళనలో గాంధీగారి శంఖారావంతో ఎంతో మంది స్త్రీలు ముందు కొచ్చి అనేక కష్టాలకోర్చి పాల్గొని చక్కటి ఆదర్శాన్ని చూపించేరన్నారు. ఈనాడు రాజకీయంగా మనం పొందిన విజయానికి ముఖ్య కారణం స్త్రీలు చేసిన త్యాగం, ఇచ్చిన ఉత్సాహ ప్రోద్బలాలే కారణమన్నారు. ఆ తర్వాత స్వర్గీయ కస్తూర్బాగాంధీ, శ్రీమతి సరోజినీ నాయుడు మొదలైన వీర నారీమణులు

స్వారాజ్య సిద్ధికై చేసిన సేవను గురించి ముచ్చటిస్తూ, యీ రాజకీయ పాఠశాలలో తర్ఫీదు పొందబోయే యువతులు వారిని ఆదర్శంగా పెట్టుకొని ఉత్తమ దేశసేవికలుగా తయారు కావాలన్నారు.

శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డిగారు స్వాతంత్ర సమరంలో ఆంధ్ర నారీమణులు చూపిన కార్య దీక్షను గురించి ముచ్చటించేరు.

ఆనరబుల్ మంత్రి వి. కూర్మయ్యగారు యీ పాఠశాలకు ఆర్గనైజరుగా నున్న శ్రీమతి అన్నే శ్రీరాజ్యంగారిని ప్రశంసించారు. శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు, శ్రీ బి. యస్. మూర్తిగారు మాట్లాడుతూ యీ పాఠశాల జయప్రదంగా జరగాలని ఆశీర్వదించారు.

ఈ పాఠశాలలో నూరు మంది స్త్రీలకు ఒక నెల రోజులు తర్ఫీదు యిస్తారు. ఈ నెలరోజులూ శిక్షణ పొందే వారికి వసతి, భోజన యేర్పాట్లు ఉచితంగా చేయబడుతాయని ప్రకటిస్తూ శ్రీ కె. వి. స్వామిగారు ఇందుకు అందరూ విరివిగా ధనసహాయం చేయాలని హెచ్చరించేరు.

గ్రంథ సమీక్ష

గాంధీతో ఒక వారం:—కల్చరల్ బుక్స్ లిమిటెడ్ పెరంబూరు పోష్టు, మద్రాసు వారి 22 వ సంస్కృతి ప్రచురణ యిది. మూలం ఇంగ్లీషులో వ్రాసిన వారు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అమెరికా పత్రికా విలేఖరియైన లూయీ ఫిషర్. వీరు సందర్శించినది యుగపురుషుడనబడుచున్న గాంధీగార్ని.

1942 వ సం. జూన్ మొదటి వారంలో గాంధీగారితో ఒక వారం రోజులు గడిపి ఆ వారం రోజుల్లోను ఆయన కన్నది విన్నది గాంధిగారితో సంభాషించినది యధాతధాగా రికార్డు చేసి ఉంచితే స్నేహితులు గ్రంధరూపంగా ప్రకటించారు. దీనికి 'దేవదాస్' గారు దివ్యంగా ఆంధ్రానువాదం గావించి 133 పేజీల్లో చక్కటి అచ్చు, గెటప్ లతో అన్ని విధాలా ఆకర్షవంతమైన పుస్తకంగా ప్రకటించారు.

మనలోను, విదేశీయుల్లోను గాంధిగార్ని అనేక విధాలుగా అర్థం చేసుకున్న వారున్నారు. ఆయన తత్వం, రాజకీయాల్లో వారి అభిప్రాయాలు గ్రహించి గాంధీగారిని చక్కగా అర్థం చేసుకోడానికి యీ పుస్తకం ఎంతో ఉపయోగిస్తుందని కారల్ హీత్ గారు పరిచయ వాక్యాల్లో నుడివిన వాక్యాలు ఎంతైనా యదార్థాలై యున్నాయి.

గాంధీగారితో సంభాషించడంవల్ల నూతన అనుభవాలను పొందేను .అని లూయీఫిషర్ గారే స్వయంగా ఒప్పుకున్నారు. ఈ గ్రంథం చదివిన ప్రతీవారూకూడా ఇలాగే ఒప్పుకోక తప్పదు. "ఇండియాలో మహత్తర శక్తి గాంధీయే" అని నైస్రాయిగారు తనతోనన్నాడట. ఇదీ సత్యమే! నన్నాడు. మన దృష్టిలోనే గాక పాశ్చాత్యుల దృష్టిలో మన నాయకుడు ఎలా కనిపిస్తాడో తెలుసుకోందుకుగూడా యీ పుస్తకం తోడ్పడుతుంది. ఫిషర్ గారు జిన్నాగార్ని సందర్శించి వార్ని గురించి కొంత దీంట్లో వ్రాసారు. ప్రఖ్యాత పత్రికా విలేఖరి దృష్టి ఎలా ప్రసరిస్తూ యుంటుందో, ఎంతతీక్ష్ణ దృష్టితో ప్రజల్ని, పరిసరాల్ని పరికిస్తూయుంటాడోనన్న విషయాలుకూడా గ్రంథం' చదువు తుంటే మనకు కనబడు తుంటాయి. ఇది జర్నలిష్టులకు గొప్ప పాఠాలు నేర్పుతుంది. ప్రజలకు అనేక భోగట్టాలిస్తుంది. పుస్తకంలో ప్రముఖనాయకుల చిత్రాలుకూడా వున్నాయి. మొత్తంమీద గ్రంథం ఒక నవల్లాగ అంతా చదవొచ్చు. వెల రూపాయిన్నర.

—కె. సు.

★

ANJAN NARIKEL

అంజన్ నారికేళ

నేత్రవ్యాధులకు చల్లని సిద్ధాంజనము. కండ్ల మంట, భారము, పోటు, మెరుపు, దురద, పుసులు, మసకలు, దుర్నీరు మొదలైనవాటిని పోగొట్టి దృష్టికి తేట తేజములను కలిగించును. రేజీకటి, ఎండచూడలేకపోవుట వగైరాలకు గూడా చాలా ఉపయోగము. వెల 0-12-0

BAITHOL ANJAN

for ACHES & PAINS

భైతాళాంజన్

ఇది మంచి పరిమళమును ఘాటును గల తైలము. తలనొప్పి, మెడనొప్పి, గొంతునొప్పి, రొమ్మునొప్పి, వాయువు నొప్పులు, కీళ్ళ నొప్పులు, బెణుకులు, పట్లు, పోట్లు, తీపులు, వాపులు అన్నిటిని క్షణములో పారదోలును. వెల 0-12-0

BAWAJ

for SKIN DISEASE

బావాజి

(చర్మ వ్యాధులకు)

దురదలు, ఎక్జిమా, గజ్జి, కురుపులు, తామర పొడ, దద్దులు, మొటిమలు, తీట, పురుగుకాట్లు, చెక్కుడు గాయములు, మొదలగు చర్మవ్యాధులకు ప్రశస్తముగా పనిచేయును. బట్టలను పాడుచేయదు. వెల 0-12-0

KESRINE

(HAIR TONIC)

కేశ్‌రీన్

(టానిక్ హెయిర్ ఆయిల్)

జబ్బుపడుటవలననో, మానసిక కష్టముల వలననో, దుర్బల శరీరతత్వమువలననో, మానవుల నరములు క్షీణించి తన్మూలమున చుండు, దురద అకాలమందే జుట్టుఊడిపోవుట, నెరయుట, బట్టతలయగుట ఇట్టివి తటస్థించును. అట్టి వారికి కేశ్‌రీన్ బాగుగా ఉపయోగపడును. శిరోజములను, దట్టముగాను, అందముగాను పెంచును.

వెల 0-12-0

VICTOR

(RINGWORM CURE)

విక్టరు

(తామర నాశని)

తామర, తీట, పొడలు మూడు పూతలతో కుదిరి చర్మము శుభ్రపడును. వెల 0-10-0

పోస్టేజి ప్రత్యేకము : వర్తకులకు రు. 10 పైబడి స్పెషలు రేట్లు

వివరములకు :

విక్టోరియా డిపో,

7, నార్తుమాడావీధి, మైలాపూరు, మద్రాసు. 4

దూరసీమల నారీప్రపంచం

అఖిల ఆస్ట్రేలియా మహిళా ప్రథమ సమావేశము 1943 లో సమావేశమై స్త్రీల ప్రాథమిక హక్కుల ప్రణాళికను నిర్ణయించింది. ఆ ప్రణాళికయే కెనడా, ఇండియా, న్యూజీలాండు దేశములలో స్త్రీల హక్కుల కొరకై ఆందోళనకు ప్రాతిపదికగా ఏర్పడింది. మూడు సంవత్సరముల కొక సారి అఖిల ఆస్ట్రేలియా మహిళాసభ సమావేశమై వివిధ ప్రభుత్వాలు ఆ ప్రణాళికను ఎట్లు అమలు పెట్టుచున్నదీ సమీక్షిస్తుంటుంది. అఖిల ఆస్ట్రేలియా మహిళా మహాసభ రెండవ సమావేశం యీ తూరి సిడ్నీ నగరంలో జరిగింది. ఆ సమావేశ వృత్తాంతం ఆంధ్రమహిళలను ఆకర్షించక పోదు. —సం||

మహాసభ ఆఖరి రోజున పెద్ద ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపు మహాసభకు వింత శోభను కలుగజేసి మహిళా సమావేశముయొక్క ప్రతిభను చాటింది. ఏ దేశానికి చెందిన వారైనా సరే, ఏ మతాన్ని అవలంబిస్తూన్నా సరే స్త్రీలంతా ఒక్కటే, ప్రపంచంలో శాంతిని స్థాపింప జేయుటకు బద్ధ కంకణులై యున్నారు, ఈ ఆదర్శ ప్రాప్తికి స్త్రీలంతా ఐకమత్యంతో పాటుబడుతారు ; శాంతి స్థాపన అనే జండా క్రింద ఒకటై నిలబడతారు అనే విషయం యీ ఉత్సవములో ప్రతిస్ఫుటించింది. రంగురంగుల తెప్పలకు రక రకాల జండాలు ఎంతో అందాన్ని యిచ్చాయి. వసంతకాలపు సూర్యకాంతుల్లో ఆ వన్నెలమగు వలవూరేగింపు కన్నుల పండువగావుంది. ఒక్కొక్క దేశపు గుర్తుకు, ఒక్కొక్క రకమైన తెప్పను అలంకరించి ఆ దేశపు ప్రతినిధులు వారి దేశాచారపు పద్ధతిని తెప్పలకు ముందుగా నడిచారు. హిందూ దేశపు ప్రతినిధులు మిసెస్. మిథాన్ లామ్, మిస్ కపిల్లాఖండ్‌వాలా ఆ వూరేగింపులో ప్రముఖ పాత్ర వహించారు. చైనా మహిళలు, ఇండొనీషియా, గ్రీసు మొదలగు అనేక దేశములనుండి వచ్చిన ప్రతినిధులు వారి వారి జాతీయ చిహ్నములను ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు.

మహాసభ అధ్యక్షురాలు మిసెస్. జెస్సీ స్ట్రీట్ అనే ఆమె ఆస్ట్రేలియాలో ఒక న్యాయాధిపతి యొక్క భార్య. సుబోధకంగా, నిర్భయంగా మాట్లాగల వక్త. ఆమె అధ్యక్షోపన్యాసంలో ఇలా అంది: "యుద్ధ సమయంలో మనమంతా ఐకమత్యంతో పాటుపడ్డాం. అదే విధంగా శాంతి సమయంలోకూడ కృషి చేయాలి. స్త్రీ పురుషుల మధ్య, జాతుల మధ్య, వర్గముల మధ్య సమానత్వం పరిగణించక పోతే ప్రపంచంలో శాంతి సుస్థిరంగా ఏర్పడజాలదు. పురుషులకున్న మాత్రమైనా అవకాశాలు స్త్రీలకుకూడ కలుగ చేస్తేనే తప్ప ఏ దేశంలోను సాంఘిక పరిస్థితులు చక్కబడవు."

మిసెస్. లామ్‌గారు ఉద్బోధించిన విషయం గుర్తించాలి. ఆమె అన్నారు: "మన శాంతి సందేశాన్ని ప్రపంచ మన్ని మూలలా విని పించాలి. దేశదేశాల మన నినాదం ప్రతిధ్వనించాలి. యుద్ధ మనే పేరుగల యీ మారణ

హోమం తిరిగి జరగకూడదని, జరగనీయమనీ ఉద్ఘాటిస్తున్నాము. దీనికై ప్రపంచంలో జీవించి యుండే శాంతి ప్రియుల నందరిని ఏకంకమ్మని, కోరుచున్నాము. (యుద్ధం పనికిరాదు అని ధర్మసూత్ర ప్రాయంగా అంటే చాలదు. శాశ్వత శాంతిని నెలకొల్పడానికి మన మంతా కలిసి పని చేయాలి. దీనికి ప్రపంచంలోని స్త్రీలందరూ ఒకటై వుండాలి.”

ఈ మహిళాసభవారు స్త్రీల ప్రత్యేక సమస్యలనే కాక నేడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న అంతర్జాతీయ సమస్యలను గూడ చర్చించారు.

మహాసభ తయారు చేసిన ప్రణాళికను అమలు పెట్టుటకు యీ క్రింది విధంగా తీర్మానించారు :—

(1) ఆస్ట్రేలియా పార్లమెంటు సమావేశమైనప్పుడు యీ మహాసభ ఒక రాయబార వర్గాన్ని పంపించి ఆ పార్లమెంటుకు హక్కుల ప్రణాళికను సమర్పించాలి.

(2) ఈ మహాసభకు ప్రతినిధుల నంపిన దేశముల కన్నిటికినీ యీ ప్రణాళికను పంపి వారి ఆమోదముకూడ పొందుటకు ప్రయత్నించాలి.

(3) ఈ మహాసభ కార్యనిర్వాహక వర్గము అవసరము కలిగినప్పుడు సంస్కరణలను శాసన రీత్యా అమలు పరచుటకు ఆస్ట్రేలియా మంత్రి వర్గమును ఒత్తిడి చేయుచుండును.

(4) ఈ మహాసభ తయారు చేసిన హక్కుల ప్రణాళికపైని సంతకములు పెట్టిన స్త్రీల సంఘములు, సంస్థలు, వారివారి నియోజక వర్గములలో ఈ మహాసభ యొక్క ఉద్దేశములను ప్రచారముచేస్తూ ప్రజాభిప్రాయమును స్త్రీ ఉద్యమమునకు అనువుగా బలపరచాలి. స్త్రీ కార్మికులకు కూడ పురుషులతో సమానముగా కూలి నేర్పరచుటకు ప్రయత్నము చేయుచున్నప్పుడు పైన పేర్కొనబడిన స్త్రీ సంఘములు, కార్మిక సంఘములు యజమానుల సంఘములతోను వ్యవహారములను చర్చించి రాజీ చేయుటకును, అందు మూలముగా స్త్రీ కార్మికుల పరిస్థితిని అభివృద్ధి చేయుటకును ప్రయత్నించెదరు.

అన్నిటి కన్నా ముఖ్యమైనది ప్రపంచశాంతిపై ఈ మహాసభ గావించిన తీర్మానము. శాశ్వత-శాంతిని సాధించుటకు ప్రజాపీడన అంతమొందాలని, నికరమైన ప్రజా పరిపాలన స్థాపించబడాలనీ వివిధ దేశముల మధ్య శాంతి స్థాపనకై ఏర్పడబోయే శాంతి ఒడంబడికలు నిర్ణయించే విషయంలో స్త్రీల అభిప్రాయములకు ప్రముఖ స్థానం ఇవ్వాలని తీర్మానించారు. స్త్రీలందరూ విభిన్న దేశాలకు చెందినా ఏకపంథామీద నడవాలని, ఐక్యత నిరూపించాలనీ ఉద్ఘాటించారు.

అఖిల ఆస్ట్రేలియా మహిళాసభ యొక్క మూడవ సమావేశం తిరిగి 1949 లో జరుగుతుంది. నేడు ఏర్పరచిన హక్కుల ప్రణాళిక వివిధ దేశాలలో ఎంత వరకు అమలులో పెట్టబడినది, యింకా ముఖ్యమైన ఇతర విషయాలు 1949 లో ఆలోచిస్తారు. ఆ నాటికి రాకపోకల సౌకర్యాలు అభివృద్ధియై వుంటాయి కాబట్టి అన్ని దేశాల నుండి ప్రతినిధులు ఆస్ట్రేలియాకు వెళ్లి ఆస్ట్రేలియా మహిళా మహాసభను అంతర్జాతీయ మహిళా మహాసభగా మార్చగలిగే అవకాశం వుంటుంది.

—ఇండియన్ హోమ్ జర్నల్ ఆధారంగా

★

రాష్ట్రీయ వ్యవహారాలు

త్రాగుడు పిశాచానికి ఉద్వాసం :— మన దేశంలో మద్యపానం ప్రజల్ని ముఖ్యంగా పాటకజనాన్ని పీల్చి పిప్పి చేస్తూయుంది. అనేక కుటుంబాలు యీ దురలవాటువల్ల దురపిల్లుతున్నాయి. లక్షలాది కుటుంబాలలో శాంతి సౌఖ్యాలు లేక ఆలుబిడ్డలు అలమటించి పోతున్నారు. ఇటువంటి త్రాగుడు పిశాచాన్ని నిర్మూలించడం ప్రజా శ్రేయస్సుకు ప్రధాన సోపానం. అందుచేత మద్యపాన నిషేధంవల్ల ప్రభుత్వాదాయానికి గొప్ప దెబ్బ అయినప్పటికి ప్రజలకు చేకూరే నైతిక, సాంఘిక, ఆర్థికశ్రేయస్సుల్ని దృష్టిలో నుంచుకొని దీన్ని నిషేధించటానికి ప్రజా సేవే ప్రధానాశయంగా పెట్టుకున్న ప్రజా ప్రభుత్వం నిశ్చయించుకుంది. ప్రజల అందరి సహకారం అర్థిస్తూ ప్రధాని ప్రకాశం పంతులుగారు అక్టోబరు 1 వ తేదీని మధ్యపాన నిషేధం ప్రారంభించారు. నిజంగా అక్టోబరు 1 వ తేదీ మద్రాసు రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయమైన దినం. గాంధీజీ నిర్మాణ కార్యక్రమంలో ముఖ్యమైన యీ మద్యపాన నిషేధం ఈ సంవత్సరం 8 జిల్లాల్లో ప్రారంభించారు. మూడేళ్లలో రాష్ట్ర మంతటా అమల్లో పెడతారు. దీనివల్ల పనులు లేకుండా పోయిన వారికి ఇతర కుటీర పరిశ్రమలు కల్పించడానికి కూడా యేర్పాట్లు చేస్తున్నారు. ఈ విధంగా ప్రజోపకార దృష్టితో ప్రారంభింపబడ్డ ఈ శుభ కార్యాన్ని గాంధీజీ మొదలైన మహాత్ములంతా ఆశీర్వదించారు. సంఘాలూ ప్రజలూకూడ తమ పూర్తి సహకారాన్నిచ్చి, దిగ్విజయంగా చేయవలసియుంది.

కల్లు త్రాగుడు పాటకజనాన్ని పీల్చి పిప్పిచేస్తునట్లే కాఫీ—టీ త్రాగుళ్లూ, చుట్ట—సిగరెట్ త్రాగుళ్లూ పట్న వాసం వార్ని బాధిస్తున్నాయి. పై దానికి ప్రభుత్వం చర్య తీసుకున్నట్లు, ఈ ఇతర త్రాగుళ్ల నిర్మూలనానికికూడా స్త్రీలు ప్రతి యింట్లోనూ ప్రొహిబిషన్ ప్రారంభిస్తే అప్పుడు ఆన్ని కుటుంబాలూ బాగుపడతాయని గ్రహించాలి. ఐతే ఒకటి! ఇందుకు చతుర్విధ సాధనోపాయాల్లో 'దండన' వదలిపెట్టి మిగతా మూడూ ప్రయోగిస్తేచాలు!!

ఖాదీ ఉత్పత్తి :— ఇది కూడా మహాత్మాగాంధి నిర్మాణ కార్యక్రమంలో చాల ప్రధానమైంది. ప్రజలకు ముఖ్యావసరాల్లో తిండి—బట్ట ప్రాణ—మానాలు నిలబెట్ట డానికి ప్రధానమైనవి. ఈ రెంటికీ కూడా అన్యదేశాలపై ఆధారపడి ఉండడం ఎంత అనర్థదాయకమో మనకందరికీ యిప్పుడు బాగా బోధపడింది. మహాత్మాగాంధి అనేక సంవత్సరాలుగా హెచ్చరిస్తున్నారు, నూలు తీయండని. స్వరాజ్యమంటే కేవలం విదేశ పరిపాలకుల్ని వెళ్లగొట్టడం కాదు. అంతకన్నా ముఖ్యం ప్రజానీకాన్ని పీడించే అనర్థాల్ని బాపి సుఖశాంతి భద్రతల్ని నెల కొల్పడమని. మనకు కావలసిన బట్ట మనం ఉత్పత్తి చేసుకున్ననాడు స్వరాజ్యం దానంతట అదే వచ్చేస్తుందన్నారు. ఇలాంటి మహత్తరమైన ఖాదీ ఉత్పత్తికి శ్రీ ప్రకాశం పంతులుగారు గొప్ప పథకాన్ని తయారు చేసి, గాంధీగారి ఆశీర్వాదాలతో మొన్న గాంధి జయంత్యుత్సవ సందర్భంలో కొన్ని ఫిర్కాల్లో ప్రారంభించేరు. ఖాదీతో బాటు మన గ్రామ పరిశ్రమల పునరుద్ధరణే దేశోద్ధారణ మంత్రమని, వీటి పునరుద్ధరణకు గొప్ప కృషి చేస్తున్నారు. పల్లెటూళ్లకే పెట్టేరని పట్నవాసం వారు తలంచక, ముఖ్యంగా వీరికే తీరికె యెక్కువ యుంటుంది గనుక, స్త్రీలంతా యిందుకు నడుంకట్టి కృషి చేయవలసియుంది. ఇది ప్రభుత్వ పథకంగా కాక స్వీయాభివృద్ధికి మనం నిర్మించుకున్న కార్యక్రమంగా అంతా గ్రహించి ఖాది ఉత్పత్తి విరివిగా జరిగించాలి.

గాంధిజీయందు మనకున్న ఆదరాభిమానాలు, పూజ్యభావాలు మాటల్లో గాక, వారి కత్యంత ప్రియదాయకమైన యిలాంటి నిర్మాణ కార్యక్రమాల్లో చూపించవలసియుంది. గాంధిజీ జన్మ దినోత్సవంతో మొన్న ఆగష్టు 2 వ తేదీని ప్రధానా మాత్యులు దీన్ని ప్రారంభించడం చాల సమంజసంగాయుంది. ఇక మిగిలింది మన కర్తవ్యమైయుంది.

మహిళా జనోద్ధరణకు రెండు బిల్లులు:— (1) 'దేవదాసి' పద్ధతి స్త్రీలోకాని కొక తలవంపుగా

నుందని గ్రహించిన మద్రాసు ప్రభుత్వం దీనికి ఉద్వాసన చెప్పేయడానికి నిశ్చయించుకున్నట్లు తెలుస్తుంది. దేవదాసి విధానంక్రింద దేవుళ్లకు, విగ్రహాలకు, గుళ్లకు, యితర మత సంస్థలకు బాలికల్ని దేవదాసీల్నిగా తయారు జేయడానికి వీలులేకుండా రేపు డిసెంబరు నెల్లో సమావేశమయ్యే శాశన సభలో ఒక బిల్లు ప్రవేశ పెట్టబోతున్నారు. డాక్టరు ముత్తులక్ష్మి రెడ్డిగారి కృషి నేటికి ఫలించినందులకు మహిళా లోకమంతా జోహారు లర్పిస్తోంది.

(2) తల్లిదండ్రుల ఆస్తి బిడ్డలు పంచుకునే మన ఆచారాల్ల ప్రకారం భూములు చిన్న చిన్న కొండ్రలై పోతున్నాయని, ఇది వ్యవసాయాభివృద్ధికి గొప్ప యిబ్బందిగా నుందని, దీనికి తోడు స్త్రీలకు భూమి ఆస్థి పంచరాదని కొన్ని అడ్డంకు లిదివరలో ఉన్నాయి. హిందూ స్త్రీలకు భూస్థితిపై వారసత్వపు హక్కు ఉండేటట్లు మన ప్రభుత్వం ఒక శాశనం చేయబోతున్నారట. ఈ బిల్లుకూడా డిసెంబరు నెల్లో ప్రవేశ పెడతారట. ప్రస్తుతం హిందూ లా ప్రకారం యీ సదుపాయం లేకుండుటచే స్త్రీల కెంత అనర్థదాయకంగా వుందో మీకు తెలిసేవుంటుంది.

దీపావళి మహోత్సవ వారమున ఆంధ్ర తమిళనాడులయందు విడుదల!



త్యాగయ్య

తెలుగుసినిమాలో తెలుగుగాయకుని దివ్యచరిత్ర చిత్రలోకాన్ని విస్మితుల చేస్తుంది!

తారాగణము:

జయమ్మ, వరిత, హేమలత, లింగమూర్తి, స్వాతి,

రామప్రోలు, రాఘవన్, దొరస్వామి, ప్రయాగ

— నిర్మాతలు —

శ్రీ రేణుకా ఫిలింస్ లిమిటెడ్,

త్యాగరాయనగర్, మద్రాస్.

ఈ క్రింది కేంద్రములలో క్రిక్కిరిసిన ప్రేక్షకులతో


ప్రదర్శింపబడుచున్నది

బెజవాడ — దుర్గకళామందిరం	బందరు — బృందావన టాకీస్
రాజమండ్రి — శ్రీరామా టాకీస్	తెనాలి — వెంకటేశ్వర టాకీస్
కాకినాడ — క్రౌన్ టాకీస్	గుంటూరు — రాధాకృష్ణా టాకీస్

గృహప్రవేశం

భానుమతి — ప్రసాద్

సి. ఎస్. ఆర్



వెనుకాడెదేలనోయి
వెనుకాడెదేలనోయి
నరనారులు కలియకయే
నవజీవనమెటులోను
... ఈ బ్రహ్మచర్యమేల
స్త్రీ ద్వేషమెందుకోయి

సారథి

డైరెక్టర్ — ప్రసాద్

పాటలు, సంగీతం: నళినీకాంతరావు. కథ: గోపీచంద్

డిస్ట్రిబ్యూటర్లు:

ఆంధ్ర, దత్తమండలములకు	సికింద్రాబాద్, హైదరాబాద్ స్టేట్స్‌కు
సరస్వతీ టాకీస్ లిమిటెడ్, బెజవాడ.	మల్లికార్జున పిక్చర్స్, సికింద్రాబాద్.

ఇతర వివరములకు: సారథీ ఫిలింస్ లిమిటెడ్, త్యాగరాయనగరు, మద్రాసు.

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the Hindi Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.